Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.11.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 25 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# పల్లెల్లో... ప్రోత్సాహం

- అటు వర్షాలు... ఇటు వరాలతో పల్లెల్లో పండుగ
- వ్యాపారాలు స్థంభించడంతో పట్టణాలు నిర్లిప్తం
- ఇసుక విధానాన్ని సవరిస్తే వ్యాపార వర్గాలకు ఊరట
- చరిత్రాత్మకమవుతున్న జగన్ నిర్ణయాలు

# నగరంలో... నిరుత్సాహం







**ఒకటా.. రెండా.. మూడా... ఒకటే వరాలు... వరుసబెట్టి పథకాలు... ఇక్కడ అమలవుతున్న పథకాలను చూసి పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులే నోరెళ్లబెడుతున్నారు. ఒక నాయకుడు తన ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అమలులోకి తీసుకురావడం అన్నది బహుశా దేశ రాజకీయ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా జరుగుతున్నట్లుంది. అలా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికే సొంతమవుతుంది.**

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పరిపాలన మొదలుపెట్టాక పల్లెలకు పండుగ కళ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న అన్ని పథకాలు కూడా దాదాపు పల్లెప్రజలకు ఎక్కువగా ఉపయోగపడేవే! రైతు భరోసా, అమ్మఒడి, గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ, పింఛన్‌ల పెంపు, కులవృత్తి కార్మికులకు ఆర్థిక ప్రోత్సాహం, ప్రతిఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డు, ప్రతి పేదకుటుంబానికి ఫీజు రీయంబర్స్‌మెంటు గ్రామ ప్రజలలో ఆదరణను పెంచేలా చేశాయి. అన్నింటికి మించి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై పల్లె ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. పట్టణాలు, నగరాలలో అన్ని రకాల చదువులు అందుబాటులో వుంటాయి. కాని, పల్లెటూర్లకు ప్రభుత్వ పాఠశాలలే దిక్కు. వాటిలో ఇంగ్లీష్ మీడియాలు వుండవు. ఆ బడుల్లో చదివించలేకే పల్లెటూరి ప్రజలు సైతం తమ బిడ్డలను పట్టణాలలోని కార్పొరేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చేర్పించి రోజూ బస్సుల్లో పంపిస్తుంటారు. ఇప్పుడు తమ (మిగతా 11వ పేజీలో)

# వాడుకుని... వదిలేశాడు!



నాడు సీనియర్.. నేడు జూనియర్

వెన్నుపోటే బాబు రూటు!

"ఏరు దాటిందాకా బోటుమల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న"... రాజకీయాలలో ఈ సామెత కరెక్ట్‌గా సరిపోయే నాయకుడు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు. (మిగతా 11వ పేజీలో)



# కంచుకోటకు బీటలు

- బాబు దుమ్ము దులుపుతున్నారు
- కృష్ణా జిల్లా నుండే మంట మొదలైంది

**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కడప కంచుకోటలాంటిదైతే... తెలుగుదేశం పార్టీకి కృష్ణా జిల్లా కంచుకోట వంటిది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు సొంత జిల్లా ఇది. కమ్మ సామాజికవర్గం బలంగా వున్న జిల్లా కూడా కావడంతో తొలి నుండి ఈ జిల్లాలో తెలుగుదేశంకు గట్టి పట్టుండేది.**

అలాంటి కంచుకోటకు ఇప్పుడు బీటలు పడుతున్నాయి. నిన్నటి ఎన్నికలలోనే ఈ జిల్లాలో తెలుగుదేశంకు గట్టి దెబ్బ తగిలింది. ఎన్నికల అనంతరం కూడా ఆ పార్టీకి షాక్‌ల పరంపర మొదలైంది. గతంలోనే బలమైన నాయకుడుగా వున్న కొడాలి నాని వెళ్లిపోయాడు. ఎన్నికల అనంతరం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తెలుగుదేశంకు రాజీనామా చేశాడు. త్వరలోనే ఆయన వైసిపిలో చేరే అవకాశాలున్నాయి. నిన్నటి ఎన్నికల్లో గుడివాడలో (మిగతా 11వ పేజీలో)



## ఉప రాష్ట్రపతి వెంకయ్య చొరవతో..

# తరలి వచ్చిన 'తెలుగు వెలుగు'

మాతృభాషకు ప్రోత్సాహమిస్తూ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తీసుకున్న చొరవతో ఎట్టకేలకు తెలుగు అధ్యయన కేంద్రం నెల్లూరుసీమకు తరలివచ్చింది. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహాకవి తిక్కన సోమయాజి జన్మించిన నెల్లూరుసీమలో, ఆంధ్రరాష్ట్ర అవతరణకు జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నడయాడిన సీమలో.. ప్రాచీన తెలుగు అధ్యయనకేంద్రం త్వరలో ప్రారంభం కాబోతోంది.



- వెంకటాచలంలో తెలుగు ప్రాచీన భాషా అధ్యయన కేంద్రం
- తెలుగుభాష అధ్యయనం.. ఇక ఇక్కడి నుంచే
- మౌలిక వసతులకు 35 లక్షలు విడుదల

తెలుగు భాషాభిమానులకు, సారస్వతవేత్తలకు ఇదెంతో శుభవార్త!.. తెలుగుభాషకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదం చేస్తుందని అందరూ భావిస్తూ.. అందుకు దోహదం చేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్యకు నిండుమనసుతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఎప్పుడెప్పుడా అని తెలుగు భాషాభిమానులందరూ ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న తెలుగుభాష అధ్యయన కేంద్రం ఎట్టకేలకు ఈ నెల 13న నెల్లూరుసీమకు తరలివచ్చింది. కవిబ్రహ్మ తిక్కన పుట్టిన గడ్డపై, త్యాగధనుడు పొట్టి శ్రీరాములు నడయాడిన సీమలో.. ఈ కేంద్రం తిరిగి మొలకెత్తడం ద్వారా తెలుగుభాష పూర్వ వైభవం సంతరించుకుంటుందనే ప్రగాఢ విశ్వాసం అందరిలోనూ కనిపిస్తోంది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి, ప్రత్యేకించి తెలుగువారికి సొంతరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు జీవితాన్ని ధారపోసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో తెలుగుభాష అధ్యయన కేంద్రం ప్రారంభం కావడం..తెలుగు భాషా వైభవానికి జరుగుతున్న కృషిలో.. మరో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లే!.. నెల్లూరు సమీపంలోని వెంకటాచలం మండలం సరస్వతినగర్‌లో ఉన్న దీన దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భవన్‌లో తాత్కాలికంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మైసూరు నుంచి సిబ్బందితో పాటు పుస్తకాలు వగైరాలన్నిటినీ ఇక్కడికి తీసుకువచ్చారు. ఇక భవనాల నిర్మాణం జరగాల్సి ఉంది.

### తెలుగుభాష అధ్యయనం.. కన్నడ సీమలోనా?...

తెలుగుభాష అధ్యయనానికి ఎంతగానో ఉపయోగపడే ఈ కేంద్రం ఎంతో కాలం నుంచి కన్నడసీమలోనే ఉండడం దురదృష్టకరం. పదేళ్ళ క్రితం తెలుగుకు కేంద్రప్రభుత్వం ప్రాచీన హోదా కల్పించడం, అప్పుడు మనది ఉమ్మడి రాష్ట్రం కావడంతో తెలుగుగడ్డ మీదనే ఈ కేంద్రం ఉండి ఉండాల్సింది. కానీ అప్పటి ప్రభుత్వాలు అంతగా పట్టించుకోకపోవడంతో ఈ కేంద్రం ఇప్పటిదాకా మైసూరులోనే కొనసాగింది. 1969లో దేశంలోని భాషల అధ్యయనం కోసం కేంద్రప్రభుత్వం మైసూరులో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(సిఐఐఎల్) కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఆ తర్వాత 2004లో తమిళభాషకు, 2008 అక్టోబరు 31న తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదా కల్పించడం జరిగాయి. ఈ భాషల అధ్యయనానికి సిఐఐఎల్‌లో భాషల వారీగా అధ్యయన కేంద్రాలను కూడా కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు తమ భాషా అధ్యయన కేంద్రాలను స్వరాష్ట్రాలకు తరలించుకుపోయాయి కానీ తెలుగు భాషా అధ్యయన కేంద్రం మాత్రం ఇంతకాలంగా మైసూరులోనే కొనసాగుతూ వచ్చింది. భాష ఉన్నది ఒక చోటైతే, ఆ భాషమీద అధ్యయనం మాత్రం వేరే రాష్ట్రాల్లో ఉండడం ఏమిటని ఎంతో కాలంగా పలువురు నేతలు ఉద్యమించినా ఫలితం దక్కలేదు.

### వెంకయ్య కృషి తెలుగుజాతికే గర్వకారణం

తెలుగుభాషా అధ్యయనకేంద్రాన్ని కన్నడసీమ నుంచి మాతృగడ్డ మీదకు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీసుకున్న చొరవతో కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించింది. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించి.. తెలుగుభాషకు పట్టం కట్టిన మహాకవి తిక్కన సోమయాజి పుట్టిన గడ్డ అయిన నెల్లూరుసీమలో ప్రాచీన తెలుగుభాష అధ్యయనకేంద్రం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు వెంకటాచలం మండలంలో ఈ కేంద్రం ఏర్పాటుకు వెనువెంటనే నిర్ణయం జరిగింది. దీంతో తెలుగుభాష మరింత కొత్తవెలుగులతో ప్రకాశమానం కానుంది. ఈ పుణ్యమంతా ఉపరాష్ట్రపతి మన వెంకయ్యనాయుడిదే కావడం, తెలుగుజాతి ఉన్నతకాలం గుర్తుంచుకునే ఈ మహత్కార్యాన్ని చేపట్టి మాతృభాషకు చేయూతనివ్వడం జిల్లాకే కాదు.. తెలుగు జాతికే గర్వకారణం. ప్రస్తుతానికి తాత్కాలిక భవనాల్లో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ త్వరలోనే సొంత భవనాలు నిర్మించుకునే కృషి జరుగుతోంది. ఇందుకు కనీసం అయిదెకరాల స్థలం అవసరమని సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు కూడా. త్వరలోనే రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించి తగు స్థలం కేటాయిస్తుందని, వచ్చే బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయిస్తుందని అందరూ ఆశిస్తున్నారు.

ఏదేమైనా తెలుగుభాష అధ్యయన కేంద్రం తెలుగునేలపై.. అందులోనూ ఎంతో సారస్వత చరిత్ర ఉన్న సింహపురి సీమలో ఏర్పాటు కావడం.. నెల్లూరు సీమకు ఒక వరమనే చెప్పాలి. ఈ కేంద్రం ఏర్పాటు ద్వారా ఒక్క సింహపురి సీమ వాసులకే కాక.. రాష్ట్రవ్యాప్తంగా సాహితీ వేత్తల ప్రతిభా పాటవాలకు మరింత గుర్తింపు లభిస్తుందని, తెలుగు వెలుగులు ఎల్లెడెలా విరాజిల్లగలవని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

సింహపురి సమాచారం

## వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులను గ్రేడ్‌ల వారీగా విభజించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని సోషల్ వెల్ఫేర్ డీడీ జీవపుత్రకుమార్ తెలిపారు. ఈనెల 20న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు నుంచి ప్రారంభమైన 90 రోజుల ప్రత్యేక కార్యక్రమం తొలి విడత పూర్తయిందన్నారు. హాస్టళ్లలో పదవ తరగతి చదివే విద్యార్థులు 1128 మంది వున్నారని, వారిలో 59 మంది వెనుకబడి వుండటాన్ని గుర్తించామన్నారు. రెండవ విడత 90 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో మెరుగైన విద్యార్థులతో బాటు వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేకంగా దృష్టిసారించి 100శాతం ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# చేతగాని పాలన

### - జగన్‌పై విరుచుకుపడ్డ కోటంరెడ్డి శీనయ్య



రాష్ట్రంలోని అస్తులమ్మి పాలన సాగించాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమని, మాజీ నుడా ఛైర్మన్, టీడీపీ నగరాధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈనెల 19న నెల్లూరు ఎన్టీఆర్ భవన్ లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోందన్నారు. సంపద సృష్టించి పాలించేందుకు అన్ని రాష్ట్రాలు తపిస్తుంటే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆస్తులమ్మి పాలన సాగిస్తాననడం సిగ్గుచేటన్నారు. అలివిగాని హామీలు ఇచ్చి అమలు చేయలేకపోతున్నారని మండిపడ్డారు. రూ. 16వేల కోట్లు లోటు బడ్జెట్‌లో వున్నాకూడా సీఎంగా చంద్రబాబు సంపద సృష్టించి ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. రాజధాని కోసం రూపాయి ఖర్చు లేకుండా 33 వేల ఎకరాలు సేకరించారని, జగన్ ఇప్పుడు ఉన్న ఆస్తులను అమ్ముతానంటున్నారని ఆగ్రహించారు. మంత్రుల మాటలు రౌడీలను తలపించేలా వున్నాయని దుయ్యబట్టారు. తిరుమల వెంకటేశ్వరస్వామితో పరాచికాలు ఆడితే పుట్టగతులు వుండవని, మంత్రి కొడాలి నాని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హరిబాబు యాదవ్, జెన్ని రమణయ్య, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, ఆర్కోటి శేషయ్య, ఖాజావలి, మెయినుద్దీన్, ఆకుల హనుమంతురావు, పసుపులేటి మల్లిఖార్జున, మురళీ, శశి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు నమోదు జనవరి వరకు పొడిగింపు

ఎన్నికల కమిషన్ ఓటు నమోదు చేసుకునేందుకు గడువును జనవరి 2020 వరకు పొడిగించింది. స్థానిక ఎన్నికలు మూడు నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం యువతీ యువకుల్లో ఉత్సాహాన్ని నింపింది. 2020 జనవరి 1 వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు నూతన ఓటు నమోదుకు అవకాశం కల్పించడం జరిగింది. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం వుంది. సవరణకు కూడా అవకాశం కల్పించారు. ఓటు హక్కు వున్న వారు ఎపిక్ కార్డుల్లో ఏమైనా తప్పులు వుంటే సవరించుకోవచ్చు. అంతేగాక వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఉన్న కుటుంబ సభ్యుల పేర్లు అన్నీ ఇప్పుడు ఒకే బూత్ పరిధిలోకి మార్చుకునే అవకాశం వుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు సంబంధిత బీఎల్వోలకు దరఖాస్తు ఫారంతో పాటు వయస్సు నిర్ధారణ ధృవీకరణ పత్రానికి సంబంధించి పదవ తరగతి సర్టిఫికెట్ గాని, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు వంటి ఆధారాలలో ఏదో ఒకటి సమర్పిస్తే సరిపోతుంది. వాటితోపాటు నివాస ధృవీకరణ పత్రం కూడా అందించాలి.

## గ్రంథాలయాలు సామాజిక దేవాలయాలు

గ్రంథాలయాలు సామాజిక దేవాలయాలని, వీటిని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్-2 కమలకుమారి అన్నారు. ఈనెల 20న జరిగిన గ్రంథాలయాల ముగింపు వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో చదివిన 32 మంది ఇటీవల గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గ్రంథాలయాల్లో ప్రతిరోజు చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలైన ఎ.లహరి, ఎ.లేఖ్య, వై.సాయివైష్ణవి, ఎ.సాయివైష్ణవి, అనుదీప్, శ్రీనివాస్, దరేష్ రామ్‌లకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీయల్ ఎన్ఎస్‌వీ ప్రసాద్, సీహెచ్ ప్రసాద్, ఎం.సతీష్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ భూములు అమ్మవద్దు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూముల్ని విక్రయించేందుకు జారీ చేసిన ఉత్తర్వుల్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకులు ఈనెల 20న నెల్లూరులోని ఆశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మిడతల రమేష్ మాట్లాడుతూ ఆలయాలకు ఆర్థిక వనరులుగానే ఉండేలా భూముల్ని ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా దేవాలయ భూముల్ని విక్రయించి ఆర్థిక వనరుగా మార్చుకుంటే హిందూ ధర్మంపై దాడిగా భావించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, ఓజిలి సుధాకర్, ఎన్ సుబ్బారెడ్డి, పి. రామకృష్ణ, నాగఫణిశర్మ, రామిశెట్టి మోహన్ పాల్గొన్నారు.

## వార్డు కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా వార్డు కార్యదర్శులు, వలంటీర్లు సమన్వయంతో వ్యవహరించాలని నెల్లూరు మునిసిపల్ కమిషనర్ పీవీవీయస్ మూర్తి పేర్కొన్నారు. ఈనెల 19 న కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 54 డివిజన్లలోని ప్రాంతాల్లో వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు సర్వే చేపట్టాలని సూచించారు. నవశకం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈనెల 30 లోపు అర్హుల జాబితాను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. వలంటీర్లకు కేటాయించిన గృహాల్లో అర్హులను గుర్తించాలన్నారు. అడిషనల్ కమిషనర్ గోపి, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

# దేదీప్యమానం.. లక్షదీపోత్సవం





- ○ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరుకు కార్తీకశోభ
- ○ మహాదీపాన్ని వెలిగించిన చిన్నజియ్యర్ స్వామి
- ○ పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

**పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు మూడురోజుల పాటు కార్తీక లక్షదీపోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా శివనామ స్మరణలతో విఆర్‌సి మైదానం మార్మోగిపోయింది.**

కార్తీకమాసం సందర్భంగా నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో పెద్దఎత్తున ఏర్పాటుచేసిన లక్షదీపోత్సవ కార్యక్రమంలో తొలిరోజున శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామితో పాటు, విపిఆర్ ఫౌండేషన్ అధినేత.. రాజ్యసభ సభ్యులు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొని మహాదీపాన్ని వెలిగించారు.

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం ఎంతో శుభప్రదమన్నారు.

ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సింహపురిలో కార్తీక మాస లక్షదీపోత్సవం నిర్వహించుకోవడం నెల్లూరీయుల అదృష్టమన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థించుకుంటూ, ప్రజల సౌభాగ్యం కోరుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

### శోభాయమానంగా వేదిక :

ఈ సందర్భంగా వేదిక ప్రాంతాన్ని మనోహరంగా తీర్చిదిద్దారు. పూల అలంకరణలతో శోభాయమానం చేశారు. హరిహర తత్వాన్ని చాటుతూ ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన భీమశంకర లింగాన్ని, భక్తులందరూ అభిషేకించుకునేందుకు వీలుగా మరో 9అడుగుల శివ లింగాన్ని, కంచి అత్తివరదరాజస్వామి రూపాన్ని ఏర్పాటుచేశారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీరామ, శ్రీకృష్ణ భగవానుని రూపాలను ఇక్కడ శోభాయమానంగా ప్రతిష్ఠింపజేయడంతో విఆర్‌సి ప్రాంగణం ఆధ్యాత్మికత వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా పూజ్యశ్రీ రాధానందభారతిస్వామి ఆధ్వర్యంలో విశిష్టపూజలు జరిగాయి.



### కార్తీకదీపాలతో..మహాపుణ్యం

దీపం పరబ్రహ్మ స్వరూపమని, కార్తీక దీపాలు వెలిగించడం మహా పుణ్యప్రదమని రెండవరోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. తొలుత పూజ్యశ్రీ రాధానందభారతిస్వామి మహాదీపాన్ని ప్రకాశమానం చేశారు. 108 మంది దంపతులతో మహాగణపతికి లక్ష గరిక పూజను ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం చండీయాగం, సహస్ర కలశాభిషేకం జరిగాయి. విపిఆర్ దంపతులతో పాటు వేమిరెడ్డి కోటారెడ్డి, రమాదేవి దంపతులు పాల్గొన్నారు. శ్రీశైల దేవస్థానం పాలకమండలి మాజీసభ్యులు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, మాజీకార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, లక్షదీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, మద్దిన విశ్వనాథ్, ఒట్టూరు సంపత్‌రాజు, ఆమంచర్ల వెంకట ప్రభాకర్‌రావు పర్యవేక్షించారు.

### కమనీయం... శివపార్వతుల కల్యాణం

మూడవరోజు జరిగిన కార్యక్రమంలో జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు, పరమహంస పరివ్రాజకాచార్య అభినవోద్దండ విద్యాశంకరభారతి మహాస్వామి, గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య సత్యానందభారతి మహాస్వామి, పూజ్యశ్రీ రాధానందభారతి స్వామితో పాటు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొని మహాదీపాన్ని వెలిగించారు. వేలాదిమంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు శివ పార్వతుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. శ్రీశైలం నుంచి విచ్చేసిన వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన పార్వతీపరమేశ్వరుల కల్యాణం భక్తులకు కనువిందు చేసింది.

సింహపురిసీమలో ఇంత దివ్యంగా లక్షదీపోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతి రెడ్డి దంపతులను ఈ కార్యక్రమాలకు విచ్చేసిన స్వామీజీలందరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించి మంగళాశాసనాలందజేశారు.

## కేంద్ర స్థాయీ సంఘాలలో
# నలుగురు నెల్లూరు ఎంపీలు



కేంద్ర మంత్రిత్వ శాఖలకు పార్లమెంటరీ సలహా సంఘాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ సలహా సంఘాలలో నెల్లూరుజిల్లాకు చెందిన నలుగురు ఎంపీలు సభ్యులుగా నియమితులు కావడం విశేషం. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని విద్యుత్, సాంప్రదాయేతర ఇంధనవనరుల స్థాయీ సంఘంలోను, వి.విజయసాయిరెడ్డిని పెట్రోలియం మరియు సహజవనరుల స్థాయీ సంఘంలోను సభ్యులుగా నియమించారు. నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రైల్వే స్థాయీ సంఘంలోనూ, నెల్లూరుకు చెందిన ఒంగోలు లోక్‌సభసభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని కేంద్ర ఆర్థిక శాఖ స్థాయీ సంఘంలోనూ సభ్యులుగా నియమించారు.


నివాళి



జననం: 21.08.1930 మరణం: 19.11.2019

భువి నుండి దివికేగిన

శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ (బుజ్జమ్మ) గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

అశ్రునివాళి.

నెల్లూరు.

## 'ప్రభా'తం

రాజకీయాలలో సిద్ధాంతాలు మాట్లాడుకోవడానికి చాలా బాగుంటాయి. ఆచరణలోకొచ్చేసరికే చాలా కష్టంగా అనిపిస్తుంటాయి. ముఖ్యంగా రాజకీయ క్రీడలో అధికారం అనే మ్యాజిక్‌తో సిద్ధాంతాలకు కాలం చెల్లుతోంది. విలువలు పాతి పెట్టబడతాయి. రాజకీయ నాయకుల రెండో కోణం బయట పడుతుంది. ఎవరి నిజస్వరూపం ఎలాంటిది అని లోకానికి చూపడానికేనేమో... దేవుడు అప్పుడప్పుడూ కొన్ని విచిత్రాలు చేస్తుంటాడు... అలాంటి విచిత్రమే ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాలలో చూస్తున్నాం.

మన దేశంలో హిందుత్వ అనుకూల పార్టీ ఏదంటే ఎవరికైనా ముందు గుర్తుకొచ్చేది భారతీయ జనతాపార్టీ. ఇది జాతీయ పార్టీ. అయితే 'హిందూత్వ' విషయంలో బీజేపీ అయినా కొన్నిసార్లు రాజీ ధోరణిలో పోతుంటుంది. మిగతా వర్గాల ప్రజలకు కూడా దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తుంది. కాని బీజేపీ కంటే కూడా హిందుత్వాన్ని పునాదిగా చేసుకుని నిర్మించబడిన పార్టీ శివసేన. మహారాష్ట్ర ప్రాంతీయ పార్టీ. శివసేన అంటేనే గుర్తుకొచ్చేది స్వర్గీయ బాల్‌థాకరే. ఆ పార్టీ వ్యవస్థాపకుడు. బ్రతికినంత కాలం పెద్దపులిగానే బ్రతికాడు. ఈ దేశంలో ముస్లిం లీగ్, ఎంఐఎం వంటి పార్టీలు ముస్లింల కోసం పెట్టినట్లే బాల్‌థాకరే కేవలం హిందూత్వం కోసమే శివసేనను స్థాపించాడు. ఆయన బ్రతికినంతకాలం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే పోరాడాడు. అధికార యావతో ఏ ఒక్కరోజూ కాంగ్రెస్‌కు సానుకూలంగా వ్యవహరించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాల మితిమీరిన లౌకికవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాడు. ఇంగ్లాండ్ వాళ్ళు పోయి ప్రస్తుతం ఇటలీవాళ్ళు దేశాన్ని పాలిస్తున్నారంటూ సోనియాగాంధీ మీద ప్రత్యక్ష యుద్ధమే ప్రకటించాడు. తమ భావజాలానికి దగ్గరగా వున్న బీజేపీతో సన్నిహితంగా మెలిగారు. ఆజన్మాంతం బాల్‌థాకరే పట్ల కూడా కాంగ్రెస్ అదే విద్వేష వైఖరిని కొనసాగించింది. ఆయనను మతోన్మాదిగా చూసింది. ఆయనను శత్రువుగానే భావించింది.

# 'మహా' నాటకం



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఏ విధంగా వచ్చాయో చూశాం. ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాలేదు. 105సీట్లు వచ్చిన బీజేపీ పూర్తి మెజార్టీకి 40సీట్ల దూరంలో ఆగిపోయింది. శివసేన రెండో స్థానంలోనూ, ఎన్సీపీ, కాంగ్రెస్ మూడు, నాలుగు స్థానాలలోనూ నిలిచాయి. ఎన్నికలకు ముందే బీజేపీ, శివసేనలు ఒక జట్టుగా, కాంగ్రెస్, ఎన్సీపీలు ఒక జట్టుగా పోటీ చేశాయి. 55సీట్లు వచ్చిన శివసేన సీఎం సీటును ఆశించడం ఏ మాత్రం సబబుకాదు. కాని, కొడుకు ఆదిత్య ధాకరేను సీఎంగా చూసుకోవాలన్న మురిపెంతో ఉద్ధవ్‌ధాకరే చిరకాల ప్రత్యర్థులైన కాంగ్రెస్, ఎన్సిపిలతో స్నేహానికి సిద్ధపడ్డాడు.

అంతటి శత్రువుగా భావించిన బాల్‌థాకరే విగ్రహానికి మొన్న ముంబైలో కాంగ్రెస్ నాయకులు దండలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులను బ్రతికినంతకాలం బాల్‌థాకరే ఎంతో దూరం పెట్టాడు. అలాంటిది మొన్న బాల్‌థాకరే జయంతికి ఆయన కొడుకు ఉద్ధవ్‌థాక్రే కాంగ్రెస్ నాయకులను పిలిపించి మరీ తన తండ్రి విగ్రహానికి దండలు వేయించాడు. ఇక్కడ కాంగ్రెస్‌పార్టీ తన లౌకిక భావాలను వదులుకుందా? మతోన్మాద శివసేన లౌకికవాద పార్టీ అయ్యిందా? మతోన్మాద నేత బాల్‌థాకరే లౌకిక వాదనేత అయ్యాడా? లేక కాంగ్రెస్ తన పంథాను మార్చుకుని శివసేన దారిలోకి వచ్చిందా? కాంగ్రెస్ కూడా శివసేనలాగే హిందూత్వ పార్టీగా మారబోతుందా?

ఎంతకాలం వుంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని అధికారం కోసం ఈ రెండు పార్టీలు కూడా తమ పునాది సిద్ధాంతాన్ని వదిలేశాయి. విలువలకు నిలువునా పాతరేశాయి. అధికారం కోసం ఒకరు, బీజేపీ మీద వ్యతిరేకతతో ఇంకొకరు... నైతికత లేని పొత్తుకు తెరతీసి ఎన్నోఏళ్లుగా తమ పార్టీలకు వున్న ఒక ఇమేజ్‌ను చెరిపేశారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఏ విధంగా వచ్చాయో చూశాం. ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాలేదు. 105సీట్లు వచ్చిన బీజేపీ పూర్తి మెజార్టీకి 40సీట్ల దూరంలో ఆగిపోయింది. శివసేన రెండో స్థానంలోనూ, ఎన్సీపీ, కాంగ్రెస్ మూడు, నాలుగు స్థానాలలోనూ నిలిచాయి. ఎన్నికలకు ముందే బీజేపీ, శివసేనలు ఒక జట్టుగా, కాంగ్రెస్, ఎన్సీపీలు ఒక జట్టుగా పోటీ చేశాయి. కాబట్టి ఈ లెక్కన తీసుకుంటే ప్రజలు బీజేపీ, శివసేన కూటమికి అధికారం కట్టబెట్టినట్లే. అయితే సీఎం సీటు విషయంలో శివసేన మడతపేచీ పెట్టింది. సీఎం సీటుకు చెరిసగం కాలం ప్రతిపాదన పెట్టింది. వాస్తవంగా చూసుకుంటే ఎన్నికల్లో ఇరు పార్టీలు పోటీ చేసిన సీట్లకు గెలిచిన సీట్లకు తేడా చూస్తే చాలా వుంది. బీజేపీ గెలుపు 70శాతంగా వుంటే, శివసేన గెలుపు 50శాతం లోపే వుంది. బీజేపీతో పొత్తు వల్లే శివసేనకు ఆ మాత్రం సీట్లయినా వచ్చాయన్నది దీనినిబట్టి అర్ధమవుతుంది. 2014 ఎన్నికల్లో బీజేపీ సొంతంగానే 125సీట్లతోనే గెలిచింది. ఆరోజు శివసేనే అనవసరమైన వివాదానికి పోయి బీజేపీకి దూరమైంది. తమ భావజాలానికి దగ్గరగా వున్న ప్రాంతీయపార్టీలను దూరం చేసుకోకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ ఎన్నికల్లో శివసేనను కలుపుకుని పోటీ చేసింది.

ఈ ఎన్నికల్లో 55సీట్లు వచ్చిన శివసేన సీఎం సీటును ఆశించడం ఏ మాత్రం సబబుకాదు. కాని, కొడుకు ఆదిత్య ధాకరేను సీఎంగా చూసుకోవాలన్న మురిపెంతో ఉద్ధవ్‌ధాకరే అవేమీ పట్టించుకోలేదు. కొడుకును సీఎంగా చూడడం కోసం చిరకాల ప్రత్యర్థులైన కాంగ్రెస్, ఎన్‌సిపిలతో స్నేహానికి సిద్ధపడ్డాడు.

కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే చాలామందిని ముంచింది. ఇటీవల కాలంలో కర్నాటకలో కుమారస్వామికి ఏ గతి పట్టించారో చూశాము. రేపు శివసేనకు కూడా ఆ గతి పట్టించబోరనే గ్యారంటీ లేదుకదా!?

మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు నెలరోజులు కావస్తున్నా ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాలేదు. శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీల కాంబినేషన్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారనుకున్నప్పటికీ చివరిలో ఎన్సీపీ ఝలక్ ఇస్తోంది... శివసేనతో అధికారం పంచుకోవడానికి ఎన్సీపీ వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో కాంగ్రెస్ బకరా అయ్యింది. శివసేన సిద్ధాంతం లేని పార్టీ అయ్యింది. ఈ రెండు పార్టీలకు వచ్చిన చెడ్డపేరు తనకు రాకూడదని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అదీగాక, ఆయనకు కేంద్రంతో పని వున్న దృష్ట్యా శివసేనకు మద్దతునిచ్చే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు సమాచారం. చివరకు ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేసినా కాంగ్రెస్, శివసేనలు తమ దారి తప్పాయన్నది చరిత్రలో నిలిచిపోనుంది.

---

## పంచభూతేశ్వరునికి లక్ష బిల్వార్చన పూజలు

నెల్లూరు పప్పులవీధి శివాజీనగర్‌లోని శ్రీరామమందిరంలో కొలువైవున్న పార్వతీదేవి సమేత శ్రీ పంచభూతేశ్వరస్వామికి ఈనెల16న లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ ప్రత్యేకపూజల్లో పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లకు ఉదయం గణపతి పూజ, గోపూజ, తులసి పూజలను నిర్వహించి, పంచభూతేశ్వరునికి బిల్వార్చనలు, పంచహారతులు, కుంభహారతులు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గండికోట బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అనంతరం శ్రీరామ భక్తసమాజం, విశ్వహిందూ పరిషత్, శ్రీ కనకదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

## జడ్పీ ఉద్యోగుల కార్తీక వనభోజనాలు

నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ కార్యాలయంలో ఈనెల 18న కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహిళా ఉద్యోగులు ఉసిరిక చెట్టుకు పూజలు చేశారు. అనంతరం జడ్పీలో పనిచేసే వాచ్‌మెన్‌లు, స్వీపర్‌లకు జడ్పీ సిఇఓ సుశీల చేతుల మీదుగా వస్త్రదానం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విధి నిర్వహణలో పనివత్తిడితో తీరికలేకుండా ఉన్న ఉద్యోగులకు కొంత ప్రశాంతత కలిగిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సుస్మితారెడ్డి, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు లక్కాకుల పెంచలయ్య, అధికారులు కొండయ్య, ఆమోష్‌బాబు, షాలెట్, రాజేష్, రషీద్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌కు సాయం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్‌సెంటర్ (మానసిక దివ్యాంగుల కేంద్రం)కు ఈనెల 18న నెల్లూరు లయన్స్‌క్లబ్-ప్రతిభ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ పరికరాలు అందజేశారు. చిన్నారులకు యూనిఫామ్‌తో పాటు ఆర్థికసాయం కూడా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ప్రతిభ అధ్యక్షుడు నూనె శ్రీధర్ మాట్లాడుతూ లయన్ కెవి రాఘవేంద్ర తన 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ఈ సాయాన్ని అందించారన్నారు. క్లబ్ కార్యదర్శి వరదా శ్రీధర్, వ్యవస్థాపకుడు ఎస్‌ఎస్‌వి రామమోహన్ పాల్గొన్నారు.

---




## అమర్‌పై అనుచిత వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌ను సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సర్కారీ జీతగాడు అంటూ విమర్శించడం సరికాదు. దేవులపల్లి అమర్ ప్రముఖ పాత్రికేయుడు, ఆయన సేవలను గుర్తించి అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా గతంలో నియమించారు. గత 5 సంవత్సరాల తెలుగుదేశం పాలనపై అనేక విశ్లేషణాత్మక కథనాలు వ్రాసి రాష్ట్ర ప్రజలను చైతన్య వంతం చేశారు. అటువంటి సమర్థ పాత్రికేయునిపై నారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయం.

– డా. యస్.బాబురావు, కావలి.

## నోటిదూలలకు వాత

టీవీ చర్చా వేదికలలో తలాతోక లేకుండా నోటికేది వస్తే అది వాగే ఎమ్మెల్సీ యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్‌కు నోటినిండా గడ్డిపెట్టాడు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ. విశాఖ ఎయిర్‌పోర్టులో వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం వెనుక ఆయన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలల హస్తం వుందని వాగాడు ఈ బాబూ రాజేంద్రప్రసాద్. తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు తెగ విర్రవీగాడు. కారు నెంబర్ విషయంలో సైతం తల బిరుసుగా వ్యవహరించాడు. వై.యస్. కుటుంబంపై నోటికొచ్చినట్లు వాగాడు. వల్లభనేని వంశీ చేతిలో అతనికి తగిన శాస్తే జరిగింది.

కోరాడ నాగరాజు, పామూరు.

## రియల్ ఎస్టేట్‌ను ఆదుకోవాలి

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతింది. ఇసుక కొరత, రాజధానిపై స్పష్టత లేకపోవడం, అధికారిక వ్యవస్థలో నెలకొన్న అవినీతి మూలంగా రియల్‌ఎస్టేట్ రంగం పుంజుకోవడం లేదు. రాష్ట్రంలో ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం రియల్‌ఎస్టేట్. దీనిని మళ్లీ పుంజుకునేలా.. అక్రమ లే అవుట్ల అవసరం లేకుండా లే అవుట్లకు ప్రభుత్వ అనుమతులు తొందరగా వచ్చేలా నిబంధనలు మార్చాలి.

– వాసు, నెల్లూరు.

## ఇంగ్లీష్ మీడియంలో తప్పేముంది

తెలుగు మన మాతృభాష. ఈ భాషా సంస్కృతిని పరిరక్షించుకోవడంలో రాజీపడాల్సిందేమీ లేదు. అదే సమయంలో ఇంగ్లీష్ మీడియంను వ్యతిరేకించాల్సిన పని లేదు. రెండు తెలుగు రాష్ట్రాలు దాటిపోతే మనం బ్రతకుదెరువు కోసం ఇతర భాషలపై ఆధారపడక తప్పదు. అంతెందుకు తెలుగు రాజధాని హైదరాబాద్ నగరంలో ఎన్నో సాఫ్ట్‌వేర్ కంపెనీలున్నాయి. సబ్జెక్ట్ పరంగా ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం వున్నోళ్లే ఎక్కువుగా ఉద్యోగాలు పొందగలుగుతున్నారు.

పి.నళిని, హైదరాబాద్.

## మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టొద్దు

ఇటీవల గుంటూరులో ఓ దేవాలయాన్ని అన్యాయంగా కూలుస్తున్నారని, హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెట్టారు. ఓ విధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టాలని చూశారు. ఒకవేళ గుడిని లేదా మసీదును తొలగిస్తున్నారంటే దాని వెనుక ప్రజాప్రయోజనార్థం కారణం వుంటుంది. గుంటూరులో కూడా రహదారి విస్తరణ కోసం మున్సిపల్ స్థలంలో వున్న గుడిని తొలగించి, గుడి నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలం చూపించారు. అసలు గుడులైనా, చర్చిలైనా, మసీదులైనా రోడ్లకు అడ్డంగా వుంటే తొలగించాల్సిందే!

– పుత్తేడు సతీష్, నెల్లూరు.



# నీళ్ల కొరత తీరింది...

# నిధుల వరద మొదలైంది!

*నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రను పరిశీలిస్తే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... ఈ జిల్లా నుండి ఎక్కువకాలం మంత్రులుగా పనిచేసినోళ్లే కాదు... జిల్లాకు అంతో ఇంతో పనిచేసినవాళ్ళు కూడా! జిల్లా నుండి మంత్రులుగా పనిచేసిన వాళ్లంటే బాగా గుర్తుండిపోయేది వీళ్ళే. జిల్లా నుండి ఇంకా ఎంతో మంది మంత్రులుగా చేసినప్పటికీ ఇతరత్రా కారణాల వల్ల వాళ్ళకు అంతగా గుర్తింపు రాలేదు.*

మంత్రిగా అవకాశం రావడమంటే తన నియోజకవర్గానికి, తన జిల్లాకు తన శక్తినిమించి సేవ చేసే అవకాశం రావడం. ఇక్కడొక ఉదాహరణ కూడా చెప్పుకోవాలి. 2011-14ల మధ్య ఆనాటి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఆనం రామ నారాయణరెడ్డి ఆర్థికశాఖ మంత్రిగా పని చేశాడు. తనకున్న పరపతితో వందలకోట్ల నిధులు తెచ్చాడు. ఆత్మకూరు నియోజకవర్గం అసలైన అభివృద్ధిని ఆ కాలం లోనే చూసింది. నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాల కూడా అప్పుడే వచ్చింది. ఇప్పటికీ ఆత్మకూరు ప్రజలు ఆనం రామనారాయణరెడ్డి చేసిన అభివృద్ధిని మరచిపోలేదు.

## జిల్లాకు మంచి చేసే అవకాశం అనిల్‌కు వచ్చింది

అలాంటి అవకాశమే జిల్లాకు, తన నియోజకవర్గానికి మంచిచేసే అవకాశమే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్‌కు వచ్చింది. జలవనరుల శాఖ అంటే జిల్లాలోని ప్రతి నియోజక వర్గానికి, ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి సంబంధించిన శాఖ. ఈ శాఖ ద్వారా జిల్లాలో సాగునీటి రంగానికి ఆయన ఎంతో చేయొచ్చు. ఆ దిశగానే ఆయన అడుగులు వేస్తున్నాడని తెలుస్తోంది. దీపముండగానే ఇల్లు చక్కదిద్దాలన్నట్లు, తాను ఇరిగేషన్ మంత్రిగా వున్నప్పుడే జిల్లాలో వున్న అన్ని పెండింగ్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో అనిల్ వున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు వేయి కోట్లతో ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టబోతున్నారని సమాచారం.

## కనుపూరు కాలువ ఆధునీకరణకు 32 కోట్లు

నెల్లూరురూరల్‌తో సహా నాలుగు మండలాలకు సాగు, తాగునీరు అందించే కనుపూరు కాలువ ఆధునీకరణ అర్ధాంతరంగా ఆగిపోయింది. మొత్తం 58కిలోమీటర్ల పొడవైన ఈ కాలువలో 34కిలోమీటర్ల వరకే ఆధునీకరించారు. మిగిలిన 24కిలోమీటర్ల ఆధునికీకరణకు 45 కోట్లతో అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే ఇదే కాలువపై 32వ కిలోమీటరు నుంచి 36వ కిలోమీటరు వరకు కాలువ వెడల్పు చాలాతక్కువుగా వున్న కారణంగా పూర్తిస్థాయిలో నీరు ప్రవహించడం లేదు. ఈ ఐదు కిలోమీటర్ల పొడవుతో కాలువ వెడల్పు చేయడానికి మరో 32కోట్లతో పంపిన ప్రతిపాదనలకు సైతం ఆమోదం లభించింది. ఈ రెండు పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తోంది.

## పెన్నార్ డెల్టాకు 130కోట్లు

పెన్నార్-డెల్టా ఆధునీకరణకు 130 కోట్లు, సముద్రం ఉప్పునీటి ప్రభావం తీర ప్రాంతాల మీద పడకుండా ముదివర్తి, ముదివర్తిపాళెం మధ్య ప్రాంతా లకు పెన్నా నీటిని అనుసంధానం చేస్తూ సూయిజ్ (తూము) నిర్మాణానికి 94 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. జైకా నిధులతో ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజక వర్గాల పరిధిలో 78కోట్లతో 35 చెరువుల ఆధునీకరణ పనులు చేయనున్నారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల అభ్యర్ధన మేరకు మంత్రి అనిల్‌కుమార్ నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపమని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు చకచకా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపగా వాటిలో కొన్నింటికి ఆమోదం లభించాయి. మిగిలిన వాటికి కూడా ఈ నెలాఖరులో అనుమతులు లభించడంతో పాటు డిసెంబర్ ఆఖరుకు టెండర్ల దశ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని మంత్రి అనిల్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

## ఆల్తూరుపాడుకు తొలగిన గ్రహణం

దక్కిలి, వెంకటగిరి తదితర మండలాల పరిధిలో 1.5లక్షల ఎకరాలకు సాగు నీరు, లక్షమందికి తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో మొదలైన ఆల్తూరుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై నీలినీడలు తొలిగిపోయాయి. ఈ పథకాన్ని రివర్స్ టెండరింగ్ ద్వారా పునఃప్రారంభించను న్నారు. 400కోట్ల అంచనాతో టెండర్లు పిలవనున్నారు. సూళ్లూరుపేట వాటంబేడు వద్ద 4.5కోట్లతో చెక్‌డ్యాం, 12చెరువులకు నీటిని సప్లైచేసే పాలచ్చూరు లైనింగ్ పనులకు 25కోట్లు, సూళ్లూరుపేట నెర్రికాలువ ఆధునీకరణకు 25కోట్లు, పాములకాలువ ఆధునీకరణకు 4 కోట్ల అంచనాతో టెండర్లు పిలువనున్నారని తెలుస్తోంది.

## మలిదేవిని వీడిన సమస్య

మలిదేవి డ్రైన్ సమస్య చాలాకాలంగా డెల్టా రైతులను వెంటాడుతోంది. ఈ డ్రైన్ ఆధునీకరణకు 82కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. డిసెంబరు మొదటి వారంలో ఈ పనులకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది. నెల్లూరు నగరం పరిధిలో ప్రవహించే సర్వేపల్లి కాలువ లైనింగ్ నిర్మాణానికి తొలిదశలో 100 కోట్లతో టెండర్లు పిలువనున్నారు. అలాగే సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణకు 12కోట్లు, కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు రూ.22కోట్లు, దేగపూడి బండేపల్లి కెనాల్‌కు రూ.24కోట్లతో పనులు మొదలు పెట్టనున్నారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు.

ఈ పనులన్నీ తన హయాంలో పూర్తి చేయగలిగితే అనిల్‌కుమార్ ఈ జిల్లా రైతుల మనసుల్లో తొలి బిసి మంత్రిగా కాదు రైతులకు ఎంతో మేలు చేసిన మంత్రిగా నిలిచిపోతాడు.

---

### ముష్టి మాఫియాకు..

# చెక్ పెట్టాలంటే...?

**• దానగుణంలో వినూత్నం**

యాచకుడు... సమాజంలో ఎన్నో రకాలుగా జీవించడానికి అవకాశాలుండగా, ఆ అవకాశాలన్నీ కోల్పోయి చివరాఖరుగా బ్రతకడానికి ఎంచుకునే మార్గం యాచకవృత్తి. ఈ సృష్టిలో అందరూ సమానమంటారు. అది కేవలం మానసిక భావన. సంపదలో గాని, ఆకారంలో గాని, గుణగుణాలలో గాని అందరూ సమానం కాదన్నది నిర్వివాదాంశం. బ్రతకడానికి ఏ దారి లేని వాళ్లే చివరకు యాచక మార్గం పడుతుంటారు. వీళ్లకు అవమానాలు, ఛీదరింపులు నిత్యకృత్యమే. అయినా వాటన్నింటినీ భరిస్తూనే భారంగా బ్రతుకు బండిని నెట్టుకొస్తుంటారు.



స్వార్ధపరులు, డబ్బును ఏ రూపంలో అయినా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నోళ్లు ఈ యాచక వృత్తిని సైతం వదలడం లేదు. దూర ప్రాంతాలలో పసిపిల్లలను కిడ్నాప్ చేయడం, వారికి కాళ్లు, చేతులు, కళ్లు వంటి అవయవాలలో లోపాలు సృష్టించి, వారిని యాచకులుగా మార్చడం, వారిని రోడ్ల మీద కూర్చోబెట్టి డబ్బులు సంపాదించడం... ఇదీ బెగ్గింగ్ మాఫియా పని. అంగవైకల్యంతో వున్న ఆ బిడ్డలను చూసి దారినపోయే వాళ్ళు మానవత్వం చూపిస్తారు. ఖచ్చితంగా రూపాయో, రెండురూపాయలో పదిరూపాయలో తమకు తోచినకాడికి దానం చేస్తారు. ఇలా సాయంత్రం దాకా వచ్చిన కలెక్షన్ మాఫియా చేతికి వెళుతుంది. ఈ పసిబిడ్డలకు మాత్రం అరకొర తిండి పెట్టి కడుపులు మాడుస్తుంటారు.

ప్రజలు నగదు రూపంలో దానం చేస్తుండబట్టే బెగ్గింగ్ మాఫియా వర్గాలు పసిపిల్లలను కిడ్నాప్‌లు చేసో, లేక పేదలైన తల్లిదండ్రుల నుండి కొనో ఈ పని చేస్తున్నాయి. అందుకే ముంబైలో కొందరు సామాజిక వాదులు భిక్షగాళ్ళకు మీరు ఇచ్చే దానాన్ని నగదు రూపంలో ఇవ్వొద్దని ఆహారం, నీళ్లు, దుస్తుల రూపంలో ఇవ్వండని ఒక సాంఘిక చైతన్యాన్ని తీసుకొచ్చారు. పసిబిడ్డల కిడ్నాప్‌లు, వారి చేత ముష్టి ఎత్తించడం వంటి వాటికి కత్తెరవేయాలంటే ఈ విధానం ఎంతో ఉత్తమం.

ప్రజలు దీనిని గుర్తించాలి. గుడుల వద్దో లేదా రోడ్ల మీదో యాచిస్తున్న పిల్లలు కనిపించినప్పుడు వారికి ఆహారపదార్ధాలు కొనివ్వండి. డబ్బుల రూపంలో ఇవ్వొద్దు. దీనివల్ల ఆ పిల్లల ఆకలన్నా తీరుతుంది. డబ్బులు ఇస్తే వారి వెనుక వుండే పెద్దోళ్ల చేతుల్లోకి పోతాయి.

అసలు పసిబిడ్డల కిడ్నాప్‌లు, వారిపై అఘాయిత్యాలు వంటివి తగ్గాలంటే యాచకులనే రోడ్ల మీద తిరక్కుండా చేసి వారికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, వారిచేత వారికి చేతనైన పనులు చేయిస్తుంటే సరిపోద్ది!

---

### క్యూరింగ్ లేదు.. కేరింగ్ లేదు..

# కుంగిపోయిన మినీబైపాస్



గత ప్రభుత్వం చివరి రోజుల్లో నెల్లూరు నగరంలో పలుచోట్ల యుద్ధప్రాతిపదికన రోడ్లు వేశారు. నాయకులు ఓట్ల దృష్టితో తొందరగా రోడ్లు వేయిస్తే, కాంట్రాక్టర్లు కూడా బిల్లుల కోసం హడావిడిగా రోడ్లు వేశారు. ఈ రోడ్లు వేయడంలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. నిబంధనలు అనుసరించలేదు. దున్న ఈనిందంటే గాటిన కట్టేయ్ అన్న సామెతగా రోడ్లేసేశారు. ఇలా చేసిన రోడ్లలో కొన్ని అప్పుడే దెబ్బతిన్నాయి కూడా! నెల్లూరు నగరానికి ట్రంక్‌రోడ్డు తర్వాత ప్రాధాన్యతగల రోడ్డు మినీబైపాస్‌రోడ్డు. ఎన్నికలకు ముందు భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనుల కోసం మినీబైపాస్‌లో తూర్పువైపు రోడ్డును రామలింగాపురం సెంటర్ నుండి అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వరకు తవ్వేశారు. పైపులు వేశాక సరిగా క్యూరింగ్ చేయలేదు, కొద్దిరోజుల పాటన్నా క్యూరింగ్ చేసి రోడ్డు వేస్తేనే అది నిలబడుతుంది. క్యూరింగ్ చేయకుండానే తీసిన మట్టిని మళ్ళీ పోసి తారురోడ్డు వేశారు. క్యూరింగ్ లేక క్రింద డొల్లడొల్ల కావడంతో వేసినరోడ్డు చాలాచోట్ల కుంగిపోయింది. కుంగిన చోట పోతే ఎక్కడ దిగబడతామోననే భయంతో వాహనదారులు దూరంగా బండ్లు పోనిస్తున్నారు. ఇంకోసారి ఈ రోడ్డును నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేస్తేనేగాని ఈ రోడ్డును రోడ్డుగా చూసే పరిస్థితి లేదు.




# నెల్లూరు కబుర్లు



## వానల వెల్లువ

నెల్లూరు నగర ప్రజలను ఈ ఏడాది వానలు ముంచెత్తుతున్నాయి. గత 5ఏళ్లుగా నవంబర్‌లో కూడా మండుటెండలతో వేసవి కాలాన్ని చూసిన నగర ప్రజలు ఈ సంవత్సరం అసలైన వానాకాలాన్ని చూస్తున్నారు. నగరంలో తరచూ వర్షాలు కురుస్తున్నాయి. పగలంతా ఎండకాసినా రాత్రివేళల్లో, లేదంటే తెల్లారుజాము సమయాలలో వాన పడుతోంది. చాలాఏళ్ల తర్వాత తమ చుట్టుపక్కల ఖాళీ స్థలాలలో నీళ్లు నిలబడి పోవడాన్ని జనం చూస్తున్నారు.

## అయ్యప్పగుడిలో పడిమెట్లు



నెల్లూరులోని అయ్యప్పగుడి ప్రాంగణంలో 18 పడిమెట్లను ఇటీవల ప్రారంభించారు. శబరి మలై అయ్యప్ప సన్నిధిలో వున్న తరహాలోనే ఈ మెట్లను రూపొందించారు. ఈ సందర్భంగా ఆలయంలో 41రోజుల మండల పూజలు ప్రారంభించారు. 2020 జనవరి 14వ తేదీన కర్పూరజ్యోతి దర్శనంతో ఆలయంలో పూజలు ముగుస్తాయి.

## మండుతున్న నిత్యావసర వస్తువులు

ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. మొన్నటి వరకు కిలో 80రూపాయలుగా వున్న మినపప్పు ప్రస్తుతం 120 రూపాయలైంది. ఇతర పప్పు దినుసులు, నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఉల్లిపాయల ధరలు ఇంకా మండుతూనే వున్నాయి.

### విజిలెన్స్ ఎస్పీగా
## బాధ్యతలు తీసుకున్న శ్రీధర్

నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఎన్.శ్రీధర్‌రావు ఇటీవల నెల్లూరులోని జిల్లా విజిలెన్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరుజిల్లా విజిలెన్స్ ఎస్పీగా వున్న కెవిపి సుబ్బారెడ్డిని ప్రకాశంజిల్లాకు బదిలీ చేయగా, తూర్పుగోదావరి జిల్లా విజిలెన్స్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీధర్‌రావును నెల్లూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీగా నియమించారు.

## జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

సమాజంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని సీనియర్ సివిల్‌జడ్జి సుధ అన్నారు. నెల్లూరులోని కొండాయపాలెం మునిసిపల్ స్కూల్‌లో స్టేట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించిన జాతీయ పత్రికా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలను, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు సంపత్‌కుమార్‌ను సత్కరించారు. ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, ఇన్‌చార్జి ఎంఇఓ నాగేశ్వరరావు, హెచ్‌ఎం భాస్కర్‌రావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సర్వేపల్లి రామ్మూర్తి, హనోక్, కోశాధికారి విజయకుమార్, గౌరవాధ్యక్షుడు రామారావు, సుబ్బిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబుల ఇబ్బందులు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఎక్సైజ్ పాలసీతో మందుబాబులకు తెగ ఇబ్బంది య్యింది. ప్రభుత్వం నడుపుతున్న మద్యం దుకాణాలలో అన్ని బ్రాండ్లు దొరకడం లేదు. అక్కడ దొరికిన బ్రాండ్‌నే కొని తాగాల్సివస్తోంది. బీర్లు తాగే అలవాటున్నోళ్లకు కూలింగ్ లేకుండా ఇస్తున్నారు. వాటిని తీసుకెళ్లి ఏ ఫ్రిజ్‌లో పెట్టుకోవాలో తెలియడం లేదు... ఇంటికి తీసుకుపోతే పెళ్లాలు తంతారుగా! పోనీ బార్‌లో కూర్చుని బీర్లు తాగుదామా అంటే బిల్లు తడిసి మోపెడవుతుందనే భయం. ఇంతకుముందు పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు వైన్‌షాపు వద్దకెళ్లినా మందు దొరికేది. ఇప్పుడు రాత్రి 8గంటలు దాటితే దుకాణం బంద్. బార్‌ల వద్ద కెళితే రేటు ఎక్కువ. అన్నింటికి మించి ఇంతకుముందు వైన్‌షాపులకు పర్మిట్ రూమ్‌లుండేవి. మందుబాబులు వాటిల్లోనే కూర్చుని తాగి తూగేవాళ్లు. ఇప్పుడు పర్మిట్ రూమ్ లెత్తేశారు. మద్యం కొని ఇంటికన్నా వెళ్లాలి, ఎక్కడన్నా రూమ్‌లు తీసుకునో, గెస్ట్‌హౌస్‌లలోనో తాగాలి. అందరికీ అలాంటి అవకాశాలుండవు కదా! కొందరు కార్లు, ఆటోలలోనే మద్యం తాగేస్తుంటే, ఇంకొందరు బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేస్తున్నారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఇటీవల నెల్లూరు, మద్రాసు బస్టాండ్ సమీపంలోని పొణకా కనకమ్మ మెమోరియల్ పాఠశాలను, ఆ పక్కనే వున్న ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో పారిశుద్ధ్యం పరిస్థితిని పరిశీలించారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని అక్కడే వున్న కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తికి సూచించారు. విద్యార్థినుల సమస్యలనడిగి తెలుసుకున్నారు.

## వైభవంగా లక్ష దీపోత్సవం



శివకేశవ లక్ష దీపోత్సవ సేవాసమితి, శ్రీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17 న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వెయ్యి కుటుంబాలతో లక్షా ఎనిమిది వేల దీపాలతో నేత్రపర్వంగా లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని, శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేద పండితులు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో వేద మంత్రోచ్ఛారణలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో శాస్త్రబద్ధంగా ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు శ్రీస్వరూపానందస్వామి, శ్రీ సంపూర్ణానందగిరి స్వామి, శ్రీహరితీర్థ స్వామి, డాక్టర్ ఆర్ గీతారాణి, శ్రీ ప్రసన్నానందస్వామి, డాక్టర్ మేడసాని మోహన్, డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శ్రీమాతా శివానంద సరస్వతీ పాల్గొని భక్తులకు కల్యాణ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. శివకేశవ లక్ష దీపోత్సవ సేవాసమితి గౌరవాధ్యక్షులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, అధ్యక్షులు ఇకె సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులు చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి, కర్ణ రాఘవరావు, మల్లెల శ్రీహరి పర్యవేక్షించారు.

## ఫ్లైఓవర్ నిర్మించాలి

- సీపీఎం నాయకుల ధర్నా



నెల్లూరు, చిల్డ్రన్స్‌పార్క్‌రోడ్డు చింతారెడ్డిపాలెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ 18వ తేదీ సీపీఎం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాకు నాయకత్వం వహించిన సీపీఎం నగర నాయకుడు ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ రోజూ వేలాది వాహనాలు ఈ జంక్షన్ వద్ద నుండి నగరంలోకి రావడం, పోవడం జరుగుతుంటుందని, ఫ్లైఓవర్ లేకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. వెంటనే ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అనాధలకు దుప్పట్లు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గురు నిలయం సభ్యులు

నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురు నిలయంలో ఈనెల 16 న పేదలకు, అనాధలకు, వృద్ధులకు, అభాగ్యులకు, యాచకులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. స్వర్గీయ మాకాని వెంకట్రావు జీవించి వున్నపుడు దాదాపు 19 సంవత్సరాలుగా ప్రతి ఏడాది నవంబర్ 16న శీతాకాలం దుప్పట్లను పంపిణీ చేసేవారు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు మాకాని గోపీచంద్, కుటుంబ సభ్యులు నేటికీ నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

## జీవో నెం.81ని రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తెలుగుభాష పరిరక్షణ వేదిక సభ్యులు

తెలుగుభాష పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18న ఆచార్య ఆదిత్య, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఎ.జయప్రకాష్, బి.నారాయణరెడ్డి, పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొని ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 81 రద్దు చేయాలంటూ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రంలో తెలుగు లెస్సు అన్నట్లుగా జీవోనెం.81 తెలియజేస్తుందని, ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1 నుండి 10వ తరగతి వరకు మాతృభాషలో విద్యా బోధన చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తెలుగు మీడియం తప్పనిసరిగా ఉండేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ప్రాథమిక తరగతులలో మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలని రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కని, ఇంగ్లీషు మీడియంలో బోధన తప్పనిసరి అని నిర్బంధం చేయడం సబబుకాదన్నారు.

## పురుగు మందుల డబ్బాలు.. పెట్రోల్ సీసాలు...

తెలంగాణలో ఎమ్మార్వో విజయారెడ్డి పై పెట్రోల్ పోసి హత్య చేసిన సంఘటన రెండు తెలుగు రాష్ట్రాలలో తీవ్ర ప్రభావం చూపుతోంది. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే బాధితులు కొందరు తమ వెంట పురుగుమందు డబ్బాలు, పెట్రోల్ సీసాలు తెచ్చుకుంటున్నారు. తమ సమస్యలు తీర్చకుంటే పురుగుమందు తాగి చచ్చిపోతామనో, లేక పెట్రోల్ పోసి తగలబెడతామనో అధికారులను బెదిరిస్తున్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఇలాంటి సంఘటనే జరిగింది. డిఆర్‌డిఏలో తన కూతురికి గతంలో వున్న ఉద్యోగం నుండి తొలగించారంటూ, ఆ ఉద్యోగాన్ని తిరిగి ఇవ్వాలంటూ ఓ తండ్రి కలెక్టర్ వద్దకు వచ్చి విన్నవించుకున్నాడు. ఆ ఉద్యోగానికి తగ్గ అర్హతలు ఆమెకు లేవని, ఆమెకు తగ్గ మరో ఉద్యోగం ఇస్తామని అధికారులు చెప్పినా అతను వినిపించుకోలేదు. అంతేకాదు, తన కూతురికి పాత ఉద్యోగం ఇవ్వకపోతే పురుగుల మందు తాగుతానని బెదిరించాడు. దీంతో కలెక్టర్‌కు మండి వారికి చీవాట్లు పెట్టాడు. పోలీసులను పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇప్పించి పంపించారు.

చేజర్ల తహశీల్దార్ కార్యాలయంలో కూడా ఒక మహిళ తన సమస్య పరిష్కారం కోసం పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేసింది.

### పంచాయితీరాజ్ ఉద్యోగుల
## కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నెల్లూరుజిల్లా పరిషత్ శాఖ ఎన్నికలు ఇటీవల జడ్పీ సమావేశ మందిరంలో ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పెంచలయ్య, అనుబంధ సంఘం అధ్యక్షుడిగా వాసుదేవరావు, ఉపాధ్యక్షురాలిగా షాలెట్, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ రషీద్, కోశాధికారిగా రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆమోస్ బాబు, కౌన్సిలర్లుగా రాంబాబు, రవికుమార్, రమాదేవి, రాజేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

## ఇందిరమ్మకు నివాళి



ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈనెల 19వతేదీ మాజీప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు, ఇందిరా భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు జిల్లా కాంగ్రెస్ నాయకులు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి అనే పదానికి నిర్వచనం ఇందిరమ్మేనన్నారు. గరీబీ హఠావో నినాదంతో రాజరికాన్ని రద్దు చేసి పేదలకు అండగా నిలిచిన మహనేత ఆమేనన్నారు. స్వర్గీయ వాజ్‌పేయి వంటి నాయకులు సైతం ఇందిరాగాంధీని అపర దుర్గాదేవిగా అభివర్ణించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అనే కనీస అవసరాలు ఆమె పరిపాలనలోనే కార్యరూపం దాల్చాయని చెప్పాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, ఉడతా వెంకట్రావ్, భవానీ నాగేంద్ర ప్రసాద్, రఘురాం ముదిరాజ్, సురేష్‌బాబు, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, టి.బాలసుధాకర్, ఫయాజ్, హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో
# సమూల మార్పులే జగన్‌రెడ్డి ధ్యేయం

## ఆ దిశగా మేము పనిచేస్తాం - ఆచార్య నారాయణరెడ్డి

## స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరి అండ్ మానిటరింగ్ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు



**మూడువేల ఐదువందల కిలోమీటర్లకు పైగా చేసిన పాదయాత్రలో తాను ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా నవ్యాంధ్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌రెడ్డి అడుగులు వేస్తున్నాడు. అందులో భాగంగా విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చి చదువు'కొనే' విధంగా కాకుండా "చదువుకునే" విధంగా రేపటి తరానికి భరోసా కల్పించే చట్టాలకు రూపకల్పన చేసి వాటిని అమలు చేయబోతున్నాడు.**

ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న అన్ని ప్రభుత్వ ప్రయివేటు విద్యా సంస్థలలో సంస్కరణలు చేపట్టడానికి కొత్తగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ మరియు మోనిటరింగ్ కమిషన్(ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్)ని ఏర్పాటు చేశారు. ఈ కమిషన్లో కడప జిల్లా కోడూరుప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ వెంబులూరు నారాయణరెడ్డికి సభ్యుడిగా ప్రభుత్వం చోటు కల్పించింది. నారాయణరెడ్డి పేరుకి కడప జిల్లా వాడే అయినప్పటికి ఆయనకు నెల్లూరు జిల్లాతో అనుబంధం ఎక్కువ.

డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న తరుణంలో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 10 యూనివర్సిటీలలో నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ కూడా ఒకటి. ఆ యూనివర్సిటీకి తొలి రిజిస్ట్రారుగా నారాయణరెడ్డిని అప్పటి ప్రభుత్వం నియమించింది. నారాయణరెడ్డిలోని ప్రతిభను సమర్ధతను అప్పట్లోనే గుర్తించిన డాక్టర్ వైయస్ ఆయనకు ఈ యూనివర్సిటీ బాధ్యతలను అప్పగించారు. కొత్త యూనివర్సిటీ తొలి రిజిస్ట్రార్‌గా నెల్లూరులో అడుగుపెట్టిన నారాయణరెడ్డి అప్పటి నుండి నెల్లూరుతో విడదీయని అనుబంధాన్ని ఏర్పరచుకున్నాడు. తన హయాంలో యూనివర్సిటీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపును తీసుకురావడమే కాకుండా అప్పట్లో యూనివర్సిటీని జాతీయ రహదారికి దగ్గరగా ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి సహా ప్రభుత్వ పెద్దలని ఆయన ఒప్పించాడు. కొత్తగా ఏర్పడిన యూనివర్సిటీలలో జాతీయ రహదారికి అందుబాటులో వెలసింది ఒక్క నెల్లూరు యూనివర్సిటీయే.

నెల్లూరులో సుదీర్ఘకాలం పనిచేసిన అనంతరం నారాయణరెడ్డి తిరుపతికి బదిలీపై వెళ్లినా, రిటైర్డ్ అయిన వెంటనే విపిఆర్ ఫౌండేషన్ సిఇఓగా బాధ్యతలు తీసుకుని మళ్ళీ నెల్లూరులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలు అందిస్తున్న అనేక సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యు డయ్యాడు. విద్య, వైద్యం, మంచినీటి రంగాలతోపాటు ఆధ్యాత్మిక రంగంలో ప్రభాకర్‌రెడ్డి దంపతులు చేస్తున్న సేవలలో నారాయణరెడ్డి తనవంతు చేయూత నందిస్తున్నాడు.

విద్యా విధానాలలో, మౌలిక సదుపాయాలలో, ఫీజుల నియంత్రణలో, అటు ప్రభుత్వ ఇటు ప్రైవేటు పాఠశాలలలో వినూత్న రీతిలో అనూహ్య మార్పులు తేవాలన్నదే ఈ ప్రభుత్వ ముఖ్య లక్ష్యంగా కమిషన్ ఏర్పడిందని, మొట్టమొదసారిగా ఇంటర్మీడియేట్ విద్యని సైతం పాఠశాల విద్యలో కలిపి జూనియర్ కాలేజీల వ్యవస్థలో కూడా సంచలనాత్మక మార్పులు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి గారి ఆశయ సాధన కోసం కమిషన్ కృషి చేస్తుందని నారాయణరెడ్డి అంటున్నారు.

పాఠశాలలు, జూనియర్ కాలేజీలతో పాటుగా బిఈడి, డిఈడి కాలేజీలను కూడా ఈ కమిషన్ పరిధిలోకి తెచ్చారని, అంతే కాకుండా టీచర్లు వారి విధి విధానాలతో పాటు అన్ని టీచర్ యూనియన్లు కూడా ఈ కమిషన్ పరిధిలోకే వస్తాయన్నారు?

జగన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మఒడి, నాడు నేడు, పథకాలతోపాటు ప్రభుత్వపాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని సమర్ధవంతంగా అమలు చేసే బాధ్యత కూడా ఈ కమిషన్‌పై ఉందని అన్నారు.

జగన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారని, కేవలం ధనవంతుల బిడ్డలకే పరిమితమైన కార్పొరేట్ చదువులను పేదవాడికి అందిస్తానని పాదయాత్రలో చెప్పిన మాట మేరకు ఈరోజు ఆ నిర్ణయం తీసుకున్నారని, దీనిపై అనవసర రాద్ధాంతం, రాజకీయాలూ మంచిది కాదని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాలవారి అభ్యున్నతి కోసం జగన్‌రెడ్డి ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని అన్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో తనకి చోటు కల్పించిన ముఖ్యమంత్రికి తనపై నమ్మకంతో తనను ప్రతిపాదించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఒక మంచి లక్ష్యంతో, మంచి ఆశయంతో, మంచి దృక్పథంతో రేపటి పౌరుల బంగారు భవిష్యత్తు కోసం జగన్‌రెడ్డి తలపెట్టిన ఈ విద్యా యాగంలో భాగమైన నారాయణరెడ్డికి 'లాయర్' అభినందనలు

---



పల్లిపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపి విపిఆర్, ఎమ్మెల్యే ప్రసన్న

# ఆశ్రమం వున్న గ్రామాన్ని...
# ఆదర్శగ్రామం చేయడమే నా ఆశయం

## - రాజ్యసభ సభ్యులు విపిఆర్

మహాత్మాగాంధీ ఆశ్రమం వున్న పల్లిపాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ఆశయమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఇటీవల ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో 1.80కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గాంధీ ఆశ్రమాన్ని చూసి పల్లిపాడును దత్తత తీసుకున్నానని, ఈ గ్రామాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ గ్రామానికి కావాల్సిన మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తున్నామని, గ్రామంలో ఫిల్టర్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తన సొంత నిధులతో వంద మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించిన అపర భగీరథుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని కొనియాడాడు. తన నియోజకవర్గ పరిధిలోని పల్లిపాడు గ్రామంపై ఆయన చూపిస్తున్న అభిమానానికి ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేమన్నాడు. రాక్షసుల పాలనలో వర్షాలు పడవని, ఇందుకు ఐదేళ్ల చంద్రబాబు పాలనే ఉదాహరణ అని, వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గద్దెనెక్కగానే వరుణ దేవుడు హర్షించి వర్షాలు కురిపిస్తున్నాడని చెప్పాడు.

ఈ కార్యక్రమంలో నుడా వైస్‌ఛైర్మన్ బాపిరెడ్డి, తహశీల్దార్ పద్మజ, ఎంపిడిఓ రఫీఖాన్, దువ్వూరు శివకుమార్‌రెడ్డి, కైలాసం ఆదిశేషారెడ్డి, జి.విజయకుమార్, బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# పంచాయితీల అభివృద్ధికి
# నిధుల మాటేంటి?

## - లోక్‌సభలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయితీల అభివృద్ధికి ఏమేరకు నిధులు కేటాయించారని నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. 19వ తేదీ లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన లేచి పంచాయితీల అభివృద్ధికి కేటాయించిన నిధులను ఆర్థిక సంవత్సరం వారీగా తెలపాలని కోరాడు. కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ దీనికి సమాధానమిస్తూ 2015 నుండి 2020 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయితీలకు గత నాలుగేళ్లలో 4917.33 కోట్లు కేటాయించామని తెలిపాడు. ఈ నిధులతో పంచాయితీలలో మౌలిక సదుపాయాల కల్పన, మంచినీటి సరఫరా, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు వంటి పనులు చేపట్టడం జరిగిందని ఆయన సమాధానమిచ్చాడు.

### గిరిజనుల వార్షిక ఆదాయం పెంచాలి

విశాఖపట్నం, విజయనగరం, నెల్లూరుజిల్లాల్లోని గిరిజనుల వార్షికాదాయాన్ని పెంచాలని నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరాడు. సోమవారం ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలలో ఆదాల మాట్లాడుతూ కర్నాటకలో తూర్పు పడమర కనుమల మధ్య నివసిస్తున్న గిరిజనులు వార్షికాదాయం పెంపుకు చాలాచర్యలు చేపట్టారని, ఏపిలోని ఈ మూడు జిల్లాల్లో వున్న గిరిజనులకు కూడా దీనిని వర్తింప చేస్తారా అని ప్రశ్నించాడు. దీనికి కేంద్ర గిరిజన శాఖ మంత్రి చంద్రశేఖర్‌బెల్లాన లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ ప్రస్తుతానికి అలాంటి ప్రతిపాదనలేవీ లేవన్నారు.

అలాగే జిడిపిని ప్రభావితం చేసే కార్పొరేట్ ట్యాక్స్, మిడ్‌ఆధార్, నేచురల్ గ్యాస్ అంశాలపై కూడా ఆదాల వేసిన ప్రశ్నలకు ఆయా శాఖల నుండి లిఖిత పూర్వక సమాధానాలు వచ్చాయి.

---

# సూళ్ళూరు ప్రజల కష్టాలు తీరుస్తా!

## - ఎమ్మెల్యే సంజీవయ్య



సూళ్ళూరుపేటలోని 15, 16 వార్డుల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 17న ఆయన సూళ్ళూరులోని పలు ప్రాంతాలు సందర్శించారు. ప్రజల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ త్రాగునీరు, రోడ్లు, డ్రైన్స్ ఏవీ సక్రమంగా లేవని, వానొస్తే బాగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే అందుకు స్పందిస్తూ.. ఈ ప్రాంతంలో త్వరితగతిన సిమెంట్‌రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నెర్రికాలువ మరమ్మతు పనులను కూడా వెంటనే ప్రారంభించాలని మునిసిపల్ డిఇఇ శ్రీరామమూర్తిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మునిసిపల్ అధికారులు, సూళ్ళూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, గోగుల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# షార్ కంట్రోలర్ రాజారెడ్డికి.. శ్రీసిటీలో ఆత్మీయ వీడ్కోలు

షార్ కంట్రోలర్‌గా పనిచేస్తూ బదిలీ అయిన జెవి రాజారెడ్డికి ఆయన చిన్ననాటి మిత్రులు, సహాధ్యాయులు అందరూ కలసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈనెల 19న శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సూళ్ళూరుపేట జూనియర్ కాలేజీలో రాజారెడ్డికి సహాధ్యాయులైన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో, అదే జూనియర్ కాలేజీలో చదువుకున్న సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రాజారెడ్డి ఉద్యోగబాధ్యతలను చక్కగా నిర్వహించడంతో పాటు సూళ్ళూరుపేట ప్రాంతానికి షార్ యాజమాన్యం ద్వారా పలు అభివృద్ధి పనులు చేయించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. తాను, రాజారెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య అందరం కలిసి 1979-81లో సూళ్ళూరుపేట జూనియర్ కాలేజీలో చదువుకున్నామని ఆయన ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం రాజారెడ్డిని అందరూ ఆత్మీయంగా.. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌బాషా తాను రాసిన సన్మాన పత్రాన్ని చదివి రాజారెడ్డికి బహుకరించారు.

నిబద్ధత, సేవాతత్వం రాజారెడ్డి తత్వమని, రాజారెడ్డి ఇక్కడి నుంచి బదిలీ కావడం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతైనా లోటని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. రాజారెడ్డి ప్రత్యేక చొరవతో సూళ్ళూరుపేట కూరగాయల మార్కెట్, ఆర్టీసి బస్టాండ్, డ్రైనేజీ



రాజారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, శ్రీసిటి ఎండి సన్నారెడ్డి

సౌకర్యాలు, మారుమూల గ్రామాలకు త్రాగునీటి వసతులు ఇలా పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన శ్రీహరికోట, శ్రీసిటీల మధ్య ఉన్న సూళ్ళూరుపేట ప్రాంతం కూడా శరవేగంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఇక్కడ జనాభా, ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో సహా అందరూ సమిష్టిగా కృషిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## గ్రంథాలయ వారోత్సవాల్లో..

# అలరించిన కవితా గానం

52వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 17న నిర్వహించిన కవిసమ్మేళనం అందరినీ అలరించింది. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో ఆయన నెల్లూరు మొలగొలుకుల బియ్యం విశిష్టతను తన కవితలో వినిపించి అందరి అభినందనలు అందుకున్నారు. పలువురు ప్రముఖ కవులు, కవయిత్రులు వివిధ అంశాలపై హృద్యమైన రీతిలో కవితా గానం చేశారు. కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన, కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, వంజవాక సతీష్‌కుమార్, ఈతకోట సుబ్బారావు, మోపూరు పెంచలనరసింహం, మేధశ్రీ, అవ్వారు శ్రీధరబాబు, ఇసనాక దయాకర్‌రెడ్డి, లక్ష్మణరాజు, దగ్గుమాటి పద్మాకర్, దుప్పటి రమేష్, మద్దూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొని తమ స్వీయకవితలను చదివి వినిపించారు. అనంతరం డిప్యూటి లైబ్రేరియన్ సిహెచ్ ప్రసాద్, సిబ్బంది అరుణ్, గిరిజాకుమారి తదితరులు కవులు, కవయిత్రులను ఘనంగా సత్కరించారు.




సత్కారాన్నందుకుంటున్న చిన్ని నారాయణరావు

# గూడూరు డివిజన్ వార్తలు

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## - సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ



ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ తెలియజేశారు. ఈనెల 18న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్ రావుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను వారికి ఏకరువు పెట్టారు. ఎన్నో ఏళ్ళుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని, దీంతో తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అర్జీదారులు వారికి వివరించారు. ప్రధానంగా 'రైతు భరోసా' పథకాన్ని పొందేందుకు భూమి ఉన్నా దస్త్రాల్లో నమోదు ప్రక్రియల తప్పుల తడకల వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

## ప్రతి ఒక్కరూ...

# మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

## - మునిసిపల్ కమిషనర్ ఓబులేశు




సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిరంగ మల విసర్జన చేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు అన్నారు. ఈ నెల 19న ఆయన గూడూరులోని షాదీమంజిల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకోని వారు ఎవరైనా ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని, మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు తాము సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి కాంతయ్య, ప్రతినిధి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండగా ఉంటా!



ఆశ్రమ నిర్వాహకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

నిరాశ్రయులైన వృద్ధులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ఈనెల 18న ఆయన గూడూరు పట్టణంలోని సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడున్న వృద్ధులను ఆత్మీయంగా పలకరించారు. ఆశ్రమానికి కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి నిర్వాహకులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవితాంతం తమ కుటుంబాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన వారు ఇప్పుడు ఇలా వృద్ధాశ్రమాల్లో తలదాచుకోవడం ఎంతో బాధాకరమన్నారు. వృద్ధాశ్రమంలో అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని, అందుకు మనసున్న దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వైకాపా నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, తాళ్ళూరు శ్రీనివాసులు, తాళంకి రమణయ్య, గోపాల్, చిరంజీవి, ఏపిజీబి మేనేజర్ నరసప్ప, నిర్వాహకులు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఫలసరుకులు



గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఇటీవల వైజేపి లయన్స్ క్లబ్ తరఫున పలువురు వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మురళీరాజుతో పాటు తోట సురేష్, మురళీనాయుడు, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డిప్లొమా ఇంజనీర్లకు

# ప్రభుత్వం సానుకూలం

## - ఏపిపి ఆర్‌డిఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



రాష్ట్రంలోని పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. ఈ నెల 17న గుంటూరులో పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పంచాయతిరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఏఇలకు డిఇఇ ప్రమోషన్ 1:3 నిష్పత్తిలో, సీనియారిటీల జాబితాలను ప్రకటించేందుకు అంగీకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాస్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. హనుమంతరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రమణ, రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు..

# విజ్ఞాన బాండాగారాలు



గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై దృష్టి సారించి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ఈ నెల 16న ఆయన గూడూరులోని సివిసి పార్కులో ఉన్న గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. తొలుత ఎమ్మెల్యేని గ్రంథాలయ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ ప్రతినిధి ప్రభావతి, వైకాపా నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, రాజారెడ్డి, నాగులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, చిరంజీవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉదయగిరికి.. 'జనవికాసం'

## - 70 కోట్లతో మైనార్టీలకు విద్యాభివృద్ధి

మైనార్టీల సంక్షేమం ధ్యేయంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జనవికాస్ పథకానికి మన జిల్లాలోని ఉదయగిరి ఎంపికైంది. మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తారు. ఈ పథకానికి రాష్ట్రంలో 6 జిల్లాలు ఎంపిక కాగా, నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి అందులో ఒకటి కావడం విశేషం. కేంద్ర మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శేఖర్ శ్రీవాత్సవ ఈనెల 18న ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ వివరాలు వెల్లడించారు. ఈ పథకం కింద ఉదయగిరిలో బాలికల విద్యాభివృద్ధి కోసం 6 నుంచి 10వ తరగతి వరకు రెసిడెన్షియల్ స్కూలు, ఒక పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐ కళాశాల భవనం, కామన్ సర్వీస్ సెంటర్, 20 పాఠశాలల్లో విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం, 8 పాఠశాలల్లో 600 మంది విద్యార్థులకు 200 సిటింగ్ టేబుల్స్, 50 మంది బాలికలకు వసతిగృహం, 50 మంది బాలురకు వసతిగృహంతో పాటు, 18 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు ఏర్పాటు చేస్తారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తదితర కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. వీటన్నిటి కోసం త్వరలోనే 70.57 కోట్ల రూపాయల నిధులు విడుదల కానున్నాయని, ఈ నిధుల్లో 60శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ భరాయిస్తాయని తెలియజేశారు.

## 23న జాబ్‌మేళా

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీలో ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## వీఆర్‌ఓలకు ప్రమోషన్లు ఇవ్వాలి

వీఆర్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలంటూ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ నెల 18న ఆయన నెల్లూరు లోని ఆర్డీఓ కార్యాలయంలో పోస్ట్‌కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రసాద్‌నాయుడు, రవిశేఖర్, సురేంద్ర, విష్ణు, గున్నయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన వైద్యసిబ్బంది

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. ఈనెల 18 నెల్లూరులోని పద్మావతినగర్, చిల్డ్రన్స్‌పార్క్ సెంటర్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఆసుపత్రి సూపర్‌వైజర్ శివరామయ్య మాట్లాడుతూ గత నాలు గేళ్ళుగా ప్రతి వర్షాకాలం ఇలా మొక్కలు నాటి పరిరక్షిస్తున్నామని చెప్పారు.

## డా. గంగిశెట్టికి 'బాలప్రియ' బిరుదు



గత అయిదు దశాబ్దాలుగా బాలసాహిత్యంలో రచనలు చేస్తూ, అనేక సారస్వత పరిశోధనలు సాగిస్తున్న నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత డా. గంగిశెట్టి శివకుమార్‌కు 'బాలప్రియ' బిరుదు లభించింది. హైదరాబాద్‌లోని బాలగోకులం సంస్థ ప్రదానం చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక బిరుదు, సన్మానానికి ఈ ఏడాది డా. గంగిశెట్టి ఎంపికయ్యారు. ఆ మేరకు ఈనెల 18న చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఆ బిరుదును, ఘనసన్మానాన్ని అందుకున్నారు. బాలగోకులం సంస్థ వ్యవస్థాపకులు ఆకెళ్ళ వెంకటసుబ్బారావు, ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి, తెలంగాణ అకాడమీ ఛైర్మన్ నందిని సిద్దారెడ్డి, దాసరి వెంకటరమణ, డా.పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొని గంగిశెట్టి శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. నెల్లూరీయుడైన డా. గంగిశెట్టి గతంలో చందమామ పత్రికకు ఉపసంపాదకునిగా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత బాల సాహిత్యంలో పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. గత ఏభైఏళ్లుగా ఎన్నో బాలల కథలు రాస్తున్నారు. తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ఆయన రాసిన కథలు బాగా ప్రాచుర్యం పొందాయి. వీరి కథలను కొన్నిటిని కర్నాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా కూడా ఎంపికచేసుకున్నాయి. బాల కథారత్న, బాలసాహితీ భూషణ్, బాలబంధు, బాలమిత్ర తదితర అవార్డులు, సన్మానాలు అందుకుని ఉన్నారు.

# ఆంగ్లేయులపై యుద్ధానికి సన్నద్ధమైన పవన్

శ్రీను గల్పిక

గుంటూరుజిల్లా మంగళగిరి హైవే కాజా టోల్‌గేట్ సమీపంలో పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ నివాసం. పవన్ కళ్యాణ్ ప్రెస్‌మీట్ పెట్టాడు. మీడియా ప్రతినిధులందరూ వచ్చివున్నారు. పవన్‌తో పాటు నాదెండ్ల మనోహర్, రాపాక వరప్రసాద్, మాదాసు గంగాధర్ వంటి జనసేన నాయకులు ప్రెస్‌మీట్‌లో కూర్చున్నారు. పవన్ మాట్లాడడం మొదలుపెట్టాడు. మన మాతృభాష తెలుగు, ఆ తెలుగును పూర్తిగా తుడిచిపెట్టడానికి జగన్మోహన్ రెడ్డి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతున్నాడు. తెలుగు మీడియంలో చదివితే బ్రతకలేరా... ఉద్యోగాలు రావా... నాలా గొప్పోళ్లు కాలేరా... తెలుగు మీడియంలో చదివితేనే మాటోట్లాళ్లం అంతంత మాత్రంగా మాట్లాడుతుంటే... ఇక ఈ ఇంగ్లీష్ మీడియంలో చదవాలంటే నాలాంటోళ్ల పరిస్థితేంటి. కాబట్టి వెంటనే ఇంగ్లీష్ మీడియం ఆలోచనను ఈ ప్రభుత్వం విరమించుకోవాలి అని డిమాండ్ చేశాడు. వెంటనే 'ఆత్మసాక్షి' టీవీ ప్రతినిధి మానసికానందరావు వుండి... సార్, మీ మాటల్లో తెలుగు మీద ప్రేమకంటే కూడా ఇంగ్లీష్ మీద కోపం ఎక్కువగా కనిపిస్తోంది. కారణం ఏంటంటూరు అని ప్రశ్నించాడు. అప్పుడు పవన్‌కళ్యాణ్... ఇంగ్లీష్‌పై నా కోపం మాటల్లో చెప్పేది కాదు, ఈ పెన్‌డ్రైవ్ ఓపెన్‌చేసి చూడు తెలుస్తుంది అని అతని చేతికి పెన్‌డ్రైవ్ ఇచ్చాడు. మానసికానందరావు వెంటనే ల్యాప్‌టాప్ తీసి దానికి పెన్‌డ్రైవ్ పెట్టి 'వార్ ఆన్ ఇంగ్లీష్' అనే ఫైలును ఓపెన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్లు బిగిన్ అయ్యాయి. అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

★★★★★

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. అక్కన్నగారి వీధిలో ఎక్సైజ్ ఎస్.ఐ కొణిదెల వెంకట్రావ్ ఇల్లు. వెంకట్రావ్ డ్యూటీ ముగించుకుని ఇంటికొచ్చాక తన చిన్న కొడుకు పవన్‌కళ్యాణ్‌ను దగ్గర కూర్చోపెట్టుకుని దేశభక్తి కథలు చెప్పేవాడు. సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, రాజ్‌గురు, రాణాప్రతాప్‌సింగ్ వంటి వీరుల చరిత్ర చెప్పేవాడు. భగత్‌సింగ్ ఎలా చనిపోయాడు నాన్నా అని పవన్‌కళ్యాణ్ అడిగాడు. ఆంగ్లేయులు అతన్ని ఉరితీశారు అని వెంకట్రావ్ చెప్పాడు. ఆ పక్కరోజే వారి పక్కింట్లో ఓ భర్త, భార్య వేధింపులు భరించలేక ఉరేసుకుని చనిపోయాడు. పవన్ కళ్యాణ్‌ది పసితనం... పక్కింటి అతను ఎలా చనిపోయాడని తన తండ్రిని ప్రశ్నించాడు. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి వెంకట్రావ్ చెప్పాడు. అప్పుడే పవన్‌కళ్యాణ్ మనసులో ఒక అభిప్రాయం బలంగా ఏర్పడిపోయింది. ఎవరైనా మెడకు తాడుతో వేలాడుతూ చనిపోయి కనిపిస్తే వారు ఆత్మహత్య చేసుకున్నట్లన్న మాట... భగత్‌సింగ్ ఫోటో కూడా ఉరికొయ్యకు వేలాడుతూ కనిపించడంతో ఆయన కూడా ఆత్మహత్య చేసుకున్నాడనే అభిప్రాయం పవన్‌లో ఏర్పడింది. ఆ ఇంగ్లీషోళ్లు ఇంకా ఏమేం చేశారని పవన్ ప్రశ్నించాడు. వెంకట్రావ్ వుండి.. వాళ్ల చేసిన వెధవ పనులు ఒకటా రెండా... మన వాళ్ళను చిత్రహింసలుపెట్టారు. అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీభాయ్ వంటి వీరులను కిరాతకంగా చంపేశారు. మన సంపదనంతా దోచుకెళ్లారు. మనల్ని మాంసం ముద్దలుగా మిగిల్చారు అని వెంకట్రావ్ ఎంతో ఆవేదనాభరితంగా చెప్పాడు. అంతా విన్న పవన్‌కళ్యాణ్ కోపంగా బెడ్‌రూంలోకి వెళ్లాడు. ఏదో బాత్‌రూమ్‌కు వెళ్లుంటాడులే అని వెంకట్రావ్ స్థిమితంగా వున్నాడు. రెండు నిముషాలకే పవన్‌కళ్యాణ్ అక్కడకు వచ్చాడు. ఆయన చేతిలో వెంకట్రావు సర్వీస్ రివాల్వర్ వుంది. అది చూసి వెంకట్రావు స్టన్ అయ్యాడు. రేయ్, ఆ రివాల్వర్ అక్కడ పెట్టు అంటూ ఆయన కేకలు వేశాడు. ఆయన కేకలకు లోపల వున్న ఆయన భార్య అంజనీదేవి, కొడుకులు చిరంజీవి, నాగబాబులు కూడా వచ్చారు. పవన్ చేతిలో వున్న రివాల్వర్‌ను చూసి వాళ్లు కూడా నిర్ఘాంతపోయారు. వెంకట్రావు ధైర్యాన్ని కూడదీసుకుని... ఇప్పుడు ఆ రివాల్వర్ తీసుకుని ఎక్కడకు పోతున్నావురా... అని ప్రశ్నించాడు. దానికి పవన్‌కళ్యాణ్... ఈ దేశం నుండి ఇంగ్లీషోళ్లను తరిమేయడానికి... మన అల్లూరి సీతారామరాజు, మన రాజ్‌గురును చంపినోళ్లను ఒక్కడినీ వదలను... మన భగత్‌సింగ్‌ను ఆత్మహత్య చేసిన వాడినైతే అసలు వదలను... వాళ్లను కూడా ఆత్మహత్య చేస్తాను అని ఆవేశంగా అనసాగాడు. వెంకట్రావు శాంతంగా... నాయనా పవన్, నీ దేశభక్తిని చూస్తే నాకు ముచ్చటేస్తోంది... కాకపోతే ఇంకో నలభైఏళ్ల ముందుగాని పుట్టుంటే నీకు ఆ అవకాశం వుండేదేమో... ఆల్‌రెడీ ఇంగ్లీషోళ్లు మన దేశాన్ని వదిలిపోయారు. మన గాంధీ తాత చేతికర్రతో వాళ్లను అదిలించి బెదిరించి కదిలించాడు. నీ రివాల్వర్ అవసరం లేదు అని చెప్పాడు. అది విన్న పవన్ షిట్ షిట్... ఒక మంచి అవకాశం పోయింది. నన్ను నలభైఏళ్ల క్రితమే కనివుంటే ఆ అవకాశమేదో వుండేది కదా... నా చేతులతో నేనే బ్రిటీష్‌వాళ్ళను తరిమేసి వుండేవాడిని కదా... అని వూగుతూ చెప్పాడు. సరేగాని, ఆ రివాల్వర్ ఎక్కడనుండి తీశావో అక్కడ పెట్టుపో... తొందరగా రెడీ అయితే ఈరోజే స్కూల్లో చేరాలి... పోదాం అని వెంకట్రావ్ చెప్పాడు. పది నిముషాల్లో స్నానం చేసి వచ్చేస్తా నాన్నగారు అంటూ పవన్ బాత్‌రూంలోకి వెళ్లాడు. అందరూ రెడీ అయ్యి టిఫిన్ చేశారు. పవన్‌ను తీసుకుని ఆయన తండ్రి వెంకట్రావు పొదలకూరురోడ్డులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు వెళ్లాడు. హెడ్‌మిస్ట్రెస్ మేరీ కోమ్‌తో మాట్లాడి తమ వాడికి చదువు బాగా చెప్పాలని మంచి ప్రయోజకుడిగా తీర్చిదిద్దాలని కోరాడు. మేరీకోమ్ వుండి... మేం ఉండేది అందుకే, మేం స్కూల్ పెట్టింది కూడా దానికే.. మీరు నిశ్చింతగా వెళ్లండి అని అభయహస్తమిచ్చింది. వెంకట్రావు హ్యాపీగా డ్యూటీకి వెళ్లాడు.

ఆరోజు సాయంత్రం 5.30గంటలైంది. వెంకట్రావ్ డ్యూటీ ముగించుకుని ఇంటికొచ్చాడు. హాల్‌లో వున్నవారిని చూసి షాక్ అయ్యాడు. ఇంట్లో స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ మేరీకోమ్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులున్నారు. వారిలో ఒకతని తలకు బ్యాండేజ్ వుంది. దానిపై రక్తపు మరకలున్నాయి. జరగరానిదేదో జరిగిందని వెంకట్రావ్ మనసు కీడు శంకించసాగింది. ఆయన తడబడుతూనే... ఏమైంది మేడమ్ ఎందుకిలా వచ్చారు అని అడిగాడు. దానికి మేరీ కోమ్... మా నోటితో మేం చెప్పలేం, మీరే చూడండి అంటూ వేలితో ఎయిర్ స్క్రీన్ గీసి సీన్ ప్లే చేసింది.

★★★★★

పవన్‌ను స్కూల్‌లో వదిలి వెంకట్రావ్ వెళ్లిపోయాడు. మేరీకోమ్ తీసుకెళ్లి పవన్‌ను ఫస్ట్ క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టింది. తొలి క్లాసు ఇంగ్లీష్, ఆ క్లాసు టీచర్ జార్జిఫెర్నాండేజ్ వచ్చాడు. నీకేం వచ్చో పలకమీద రాయి అని పవన్‌ను అడిగాడు. పవన్ పలకమీద "అమ్మ, ఆవు, ఇల్లు, ఇటుక...' అనే తెలుగు పదాలు రాసి జార్జి ఫెర్నాండేజ్‌కు చూపించాడు. అది చూడగానే అతనికి అరికాల్లో మండింది. ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగుపదాలు వ్రాస్తావా... చేయి చాపు అంటూ పవన్ చేతి మీద బెత్తంతో టపీ టపీ మని కొట్టాడు. తర్వాత ఎ ఫర్ ఆపిల్, బి ఫర్ బాయ్, సి ఫర్ క్యాట్, డి ఫర్ డాగ్... అని బోర్డు మీద వ్రాసి వాటిని పలక మీద రాసి చూపించమన్నాడు. తెలుగు పదాలను కించపరుస్తూ మాట్లాడి వుండడంతో పవన్ అప్పటికే ఉడికిపోతున్నాడు. అగ్గిమీద ఆజ్యం పోసినట్లుగా ఇంగ్లీష్ పదాలు రాయమనేసరికి అతనికి లెక్కలేనంత తిక్క రేగింది. తన తండ్రి ఇంగ్లీష్‌వాళ్ళు ఈ దేశం వదిలిపోయారని చెప్పాడు... అది నిజం కాదు, ఇంకా కొంతమంది మిగిలే వున్నారని మనసులో అనుకుని... టీచర్‌ని కోపంగా రేయ్... ఇంగ్లీషోడు ఈ దేశం వదిలిపోయినా ఇంకా మీ ఇంగ్లీష్ భాషేంట్రా... ఐ హేట్ ఇంగ్లీషోడు... ఐ హేట్ ఇంగ్లీష్ లాంగ్వేజ్... అంటూ కోపంతో తన చేతిలోని పలకను జార్జి ఫెర్నాండెజ్ తలకేసి కొట్టాడు. అది అతని తలకు బలంగా తగిలి రక్తం కారసాగింది.

ఇక్కడితో ఎయిర్ స్క్రీన్ షో ముగిసింది. ఇదండీ... జరిగింది, మీవాడిని చదివించడం మావల్ల కాదు అని మేరీ కోమ్ చెప్పింది. వెంకట్రావు వుండి... వాడికి ఇంగ్లీషోళ్లకు, ఇంగ్లీష్ చదువు చెప్పేవాళ్లకు తేడా తెలియడం లేదు... ఆంగ్లం మాట్లాడే ప్రతివాడినీ ఆంగ్లేయుడే అనుకుంటున్నట్లున్నాడు. ఆంగ్లేయుల గురించి వాడికి చెప్పి తప్పు చేశాను, వాడిని ఎక్కడన్నా తెలుగు మీడియంలో చదివిస్తాను అని చెప్పి ఆయన వారిని పంపించేశాడు.

★★★★★

ఇక్కడితో ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద సీన్లు ముగిశాయి. తర్వాత పవన్ వుండి విలేకరులతో... నాకు ఇంగ్లీష్ అంటే అప్పటినుండే కోపం... ఆంగ్లేయులను వదిలించుకున్నా, మనకు ఇంకా వాళ్ల ఆంగ్ల మెందుకు అని చెబుతుండగా ఆయన విదేశీ భార్య అన్నా లెజ్నొవ వచ్చి కాఫీ ఇచ్చింది. 'ఆత్మసాక్షి' టీవీ ప్రతినిధి మానసికానందరావు అది చూసి, నిజమే సార్, మీకు విదేశీయులన్నా, విదేశీ మహిళలన్నా, విదేశీ చదువులన్నా మహాకోపం అంటూ అక్కడ నుండి లేచాడు.

# కల్యాణ వైభవం...!





బిఎంఆర్ ఆక్వా సి.ఇ.ఓ పెళ్ళూరు రవి - విజయల కుమారుడు **దీపక్‌రెడ్డి - ప్రత్యూషరెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు చిల్లా నాగిరెడ్డి - ప్రభల కుమార్తెల కల్యాణం ఈ నెల 15వ తేదీ హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌డెకన్, కోహినూర్ హాల్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.




ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్‌గా రిటైరైన చెన్నారెడ్డి భాస్కర్‌రెడ్డి - పద్మావతిల కుమార్తె **లక్ష్మీమౌన్య - పావనచరిత్‌రెడ్డి** (ప్రకాశం జిల్లా జెల్లివారిపుల్లలచెరువు వాస్తవ్యులు నర్లా పాండురంగారెడ్డి - ప్రమీలాదేవిల కుమారుడు) ల వివాహం ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని అనిల్‌గార్డెన్స్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.




నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు ఇంటూరు రమేష్ - రాజేశ్వరిల కుమార్తె **భరణిక - నవీన్‌కుమార్** (నెల్లూరు పడారుపల్లి వాస్తవ్యులు మాందేడి సంజీవ్‌రెడ్డి - ఇందిరల కుమారుడు)ల పెళ్లి ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.




సీనియర్ పాత్రికేయులు శిఖరం వెంకటకృష్ణయ్య - నాగలక్ష్మిల కుమార్తె **మాధుర్య - సూర్యప్రతాప్** (అల్లూరు గ్రామవాస్తవ్యులు రామిశెట్టి చెన్నకేశవులు - శోభల కుమారుడు)ల పరిణయం ఈ నెల 14వ తేదీ అల్లూరులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

- కావలిలో అమృతధార...

# విపిఆర్ 100వ ప్లాంట్



జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు సైతం స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఒక యజ్ఞాన్ని ప్రారంభించిన రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక మైలురాయిని అధిగమించారు. విపిఆర్ అమృతధార క్రింద మొదలుపెట్టిన ఈ జలయజ్ఞంలో 100వ వాటర్ ప్లాంటును ఈ నెల 16వ తేదీన కావలి పట్టణంలోని బుడంగుంటలో ఆయన తన సతీమణి, టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.

## ఆల్తూరు గిరి ఆధ్వర్యంలో..

# శివ పంచాక్షరి సప్తాహం

- ఈనెల 26 దాకా అఖండ శివనామ సప్తాహం
- హర నామస్మరణలతో మార్మోగుతున్న మూలస్థానేశ్వరాలయం



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నగరంలోని శివాలయాల్లో కొలువై ఉన్న పార్వతీపరమేశ్వరులకు ఎంతో భక్తిశ్రద్ధలతో విశిష్టపూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీ మూలస్థానేశ్వరాలయంలో శ్రీశైలం ఆలయ మాజీ ధర్మకర్త ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19న శివ సప్తాహం ప్రారంభమయ్యింది. గత ఆరేళ్ళుగా ప్రతి కార్తీక మాసంలోనూ గిరీష్‌రెడ్డి శివమాల దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈనెల 26వ తేది వరకు జరిగే ఏడవ శివమాల దీక్షల్లోనూ భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా అఖండ శివనామ భజన సప్తాహం కూడా ప్రారంభమైంది. గిద్దలూరు నుంచి వచ్చిన భజనబృందంతో కలసి శివమాల దీక్షా భక్తులు పెద్దపెట్టున చేస్తున్న హరనామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. ఈ సందర్భంగా తొలిరోజున ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ మూలస్థానేశ్వరునికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, ప్రత్యేకపూజలు, విశేష హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు పి.రూప్‌కుమార్‌యాదవ్, ఆలయ ఇ.ఓ వేణుగోపాల్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. రాత్రికి స్వామివారికి విశేష పూలంగిసేవ, ప్రాకారోత్సవం ఎంతో వేడుకగా నిర్వహించారు.

# అర్హులందరికీ నవశకం - జిల్లా కలెక్టర్



అర్హులైన పేదలందరికీ నవశకం పథకాలు అందేలా జిల్లాలో సమగ్ర సర్వే ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన నెల్లూరు జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, వాటన్నింటని నవశకం ద్వారా అమలు చేయనున్నామన్నారు. వైయస్ఆర్ తెల్లకార్డు, వైయస్ఆర్ ఆరోగ్యశ్రీకార్డు, వైయస్ఆర్ పెన్షన్ కార్డు, వైయస్ఆర్ సున్నావడ్డీ, వైయస్ఆర్ అమ్మఒడి, వైయస్ఆర్ కాపు నేస్తం, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి పదివేలు, ఇమామ్‌లు, మౌజన్‌లు, పాస్టర్‌లకు గౌరవ వేతనాలు వంటి పథకాలు వైయస్ఆర్ నవశకంలో పొందుపరచివున్నాయని చెప్పారు.

# డా.జగదీష్‌కు సివి రామన్ మెమోరియల్ అవార్డు



ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ నెలకొల్పిన సర్ సివి రామన్ మెమోరియల్ అవార్డ్ ఫర్ సైన్స్ పాపులరైజేషన్ అండ్ కమ్యూనికేషన్–2019కి ప్రముఖ అంతర్జాతీయ శాస్త్రవేత్త, స్థానిక నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డా.ఎ.జగదీష్ ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఆయన ఈనెల 28న అందుకోనున్నారు. ఈ అవార్డును ఏ.పి సైన్స్ కాంగ్రెస్–2019 నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, డా.బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ–శ్రీకాకుళంలో జరిగే కార్యక్రమంలో గవర్నర్ చేతులమీదుగా అందుకుంటారు. డా.జగదీష్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎనర్జీ,ఎన్విరాన్‌మెంట్ తదితర అంశాల్లో సుమారు 5 దశాబ్దాలుగా విశేష కృషిచేస్తున్నారు. 50 దేశాల్లో జరిగిన అంతర్జాతీయ వైజ్ఞానిక సదస్సుల్లోనూ పాల్గొన్నారు. అంతేకాదు ఎంతో ప్రతిష్టాత్మకమైన 15 అంతర్జాతీయ అవార్డులను కూడా ఆయన అందుకోవడం విశేషం.

# ప్లాస్టిక్‌పై 'లయన్స్' గర్జన

పర్యావరణానికి, పరిశుభ్రతకు పాత రేస్తున్న ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల వినియోగంపై నెల్లూరు లయన్స్‌క్లబ్, విఆర్‌సియు ఎన్ఎస్ఎస్ యూనిట్‌లు సింహగర్జన చేశాయి. ఎవరికి వారు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని మానేయాలని కోరుతూ ఈనెల 17వతేది ఉదయం వీరంతా కలిసి ప్లాస్టిక్‌కు వ్యతి రేకంగా ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులు, స్థానిక ప్రజలు ఈ భారీ ప్రదర్శనలో పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ నెల్లూరుశాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.కృష్ణమూర్తి, నగర పాలకసంస్థ కమిషనర్ వివిఎస్ఎస్‌వి మూర్తి, సామాజిక అటవీ అధికారి యస్.రవిశంకర్, మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, డికెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ డా. మస్తానయ్య, విఆర్‌సియు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ కుమార్, నావెల్‌యూనిట్ సిఓ జి.యస్ యుగంధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. స్థానిక సర్వోదయ కళాశాల వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ సాగింది. లయన్స్ డిస్ట్రిక్ట్ 316-జె గవర్నర్ కిశోర్ కుమార్ ర్యాలీని ప్రారంభించగా, మైథిలి మనోహర్‌రెడ్డి అందరిచే ప్లాస్టిక్ నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. పిడిజిలు అమృతవల్లి, యడ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్‌వి రమణయ్య, లయన్స్ జిల్లా ట్రెజరర్ ఏవిఆర్ మోహన్‌రావు, అడిషనల్ ట్రెజరీ అధికారి ఆంజనేయులు, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి శ్రీధర్‌తో పాటు అభిరాం శ్రీరాములు, నాగరాజు, మురళీనాయుడు, రాజా మల్లి కార్జునరావు, ప్రవీణ్‌శంకర్, సంతోష్, గౌతమ్, డా. రవిశంకర్, సత్యనారా యణ, బసవయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# వాడుకుని.. వదిలేశాడు

(మొదటి పేజీ తరువాయి)

ఏ టైంలో ఎవరిని ఎలా వాడుకోవాలో చంద్రబాబు అలా వాడేసుకుంటుంటాడు. వాడకం అయిపోయి ఇక అతనితో పని లేదనుకున్నాక విసిరి దూరంగా పారే స్తుంటాడు. పాపం ఏ జన్మలో బాకీ వున్నాడో, లేక ఏ విధంగా ఋణపడ్డాడో గాని స్వర్గీయ నందమూరి తారకరామా రావు ఈ జన్మలో చంద్రబాబు బాకీ తీరు స్తున్నాడు. ఆయన చనిపోయాక కూడా ఆయన వారసులు చంద్రబాబు బ్యాలెన్స్ బాకీని తీరుస్తూనే వున్నారు.

ఎన్టీఆర్ అల్లుడు కాకపోయుంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగలిగేవాడా? దాదాపు ఆ ఛాన్స్ వుండేదికాదు. ఈ దేశ చరిత్రలో ముఖ్యమంత్రులు లేదా ప్రధాన మంత్రులుగా చేసినోళ్లు కూడా తమ బిడ్డలను వారసులుగా తెచ్చుకున్నారు. కాని ఎన్టీఆర్‌కు ఆ అవకాశం లేకుండా పోయింది. ఆయనకు తెలియకుండానే, ఆయన బిడ్డల సహకారంతోనే ఆయన కుర్చీని, ఆయన పెట్టిన పార్టీని చంద్రబాబు లాగేసుకోగలిగాడు.

ఎన్టీఆర్ తదనంతరం కూడా ఆయన కుటుంబాన్ని చంద్రబాబు అవసరం మేరకు వాడుకుంటూనేవున్నాడు. ఎన్టీఆర్ తన యుల్లో సినిమా ఇమేజ్ వున్న బాలకృష్ణను వియ్యంకుడిని చేసుకోవడం ద్వారా అతని నుండి ప్రమాదం లేకుండా చేసుకున్నాడు. ఎన్టీఆర్ మూడో తరం పిల్లల్లో ప్రజల్లో ఇమేజ్ వుండేది స్వర్గీయ నందమూరి హరికృష్ణ రెండో భార్య కుమారుడు జూనియర్ ఎన్టీఆర్‌కే! 1995–2004ల మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో సినీ పరిశ్రమలో జూనియర్ ఎన్టీఆర్‌ను ఎదగకుండా చేసేందుకు చంద్ర బాబు, మిగతా నందమూరి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నించారు. అతని సినిమా అవకాశాలను అడ్డుకోవాలనుకు న్నారు. అతనికి పోటీగా నందమూరి కుటుంబం నుండి తారకరత్నను దించారు. అతను హీరోగా ఒకేరోజు ఆరు సినిమా లకు క్లాప్‌లు కొట్టించారు. కాని సీనియర్ ఎన్టీఆర్ నట వారసత్వం తనకే అబ్బిన ట్లుగా జూనియర్ ఎన్టీఆర్ ఈ అవాంతరా లను అధిగమించి దూసుకుపోయాడు.

2009 ఎన్నికల నాటికి తాను అణగ దొక్కాలనుకున్న జూనియర్‌నే చంద్రబాబు మళ్లీ లైన్‌లోకి తీసుకున్నాడు. అప్పటికే జూనియర్ టాప్‌హీరోగా రాణిస్తున్నాడు. ఆయన ఇమేజ్‌ను ఓట్ల రూపంలోకి మలచుకోవాలని భావించిన చంద్రబాబు అతనిని పూర్తిస్థాయిలో ప్రచారానికి తిప్పాడు. బాబును నమ్మి ఎన్టీఆర్ బాగానే తిరిగాడు. ఆరోజు సీఎంగా వున్న వైయస్ రాజశేఖరరెడ్డిపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు చేశాడు. అయితే ఆరోజు రాజశేఖరరెడ్డి పరిపాలనకే ప్రజలు మళ్లీ ఓటేయడంతో చంద్రబాబు ఆశలన్నీ ఆవిరైపోయాయి. జూనియర్ ఎన్టీఆర్ వల్ల తనకు ఉపయోగం లేకుండా పోయిందనే అభిప్రాయం ఆయన మనసులో పడింది.

అందుకే 2014 ఎన్నికలొచ్చేసరికి ఎన్నికల ప్రచారానికి రమ్మని జూనియర్ ఎన్టీఆర్‌ను మర్యాదకోసమైనా పిలవలేదు. తనకు ఏ మాత్రం సంబంధంలేని పవన్ కళ్యాణ్‌ను ఇంటికి వెళ్లి పిలుచుకున్నాడు. ఆయనను బాగానే వాడుకున్నాడు. పవన్ వల్ల ఆయన అభిమానుల ఓట్లతో పాటు కాపు సామాజిక వర్గం ఓట్లు కూడా కలిసి వస్తాయనే బాబు ప్లాన్ ఆ ఎన్నికల్లో సక్సెస్ అయ్యింది. అప్పటినుండి జూనియర్ ఎన్టీఆర్‌ను పూర్తిస్థాయిలో దూరం పెట్టాడు. ఈ ఏడాది ఎన్నికలకు కూడా జూనియర్‌ను పిలవలేదు. పార్టీలో ఆయన ఊసే లేకుండా చేశాడు.

జూనియర్ ఎన్టీఆర్‌తో చంద్రబాబుకు వున్న అసలు భయం తాను అతని తాత నుండి లాక్కున్న తెలుగుదేశం పార్టీని జూనియర్ ఎన్టీఆర్ ఎక్కడ లాక్కుంటాడో నని! చంద్రబాబుకు వయసు పైనపడింది. రాజకీయ వారసుడిగా లోకేష్‌ను తీసుకు వచ్చాడు. కాని, పార్టీ శ్రేణులకు లోకేష్ నాయకత్వం నచ్చడం లేదు. అతను అంతటి సమర్ధుడు కూడా కాదు. అందుకే తెలుగుదేశంను నిలబెట్టాలంటే జూనియర్ ఎన్టీఆర్‌ను పార్టీలోకి తీసుకురావాలనే వాదనలు మొదలయ్యాయి. గతంలో పార్టీని వదిలేసి వైసిపిలో చేరిన కొడాలి నాని, ఇప్పుడు టిడిపిని వదిలేసిన వల్లభనేని వంశీలు కూడా జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావన తెచ్చారు.

జూనియర్ టాపిక్ రావడంతోటే చంద్రబాబు అప్రమత్తమయ్యాడు. వంశీ తర్వాత ఒకరి తర్వాత ఒకరు నాయకులు వరుసబెట్టి జూనియర్ ఎన్టీఆర్‌ను పార్టీలోకి తీసుకురావాలనే డిమాండ్ చేస్తారేమోనని ఆందోళన చెందాడు. జూనియర్ ఎన్టీ ఆర్‌ను పార్టీలోకి తీసుకురావడమంటే లోకేష్‌ను తెరమరుగు చేయడమే..! ఈ ప్రమాదాన్ని వూహించిన చంద్రబాబు అలర్ట్ అయ్యాడు. పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ అవసరం లేదంటూ వర్ల రామయ్య చేత చెప్పించాడు.

ఆ విధంగా జూనియర్‌ను వాడుకుని ఇప్పుడు పూర్తిగా పక్కన పెట్టేశాడు.

# ప్రోత్సాహం - నిరుత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పూర్లోనే ఇంగ్లీష్ మీడియం స్కూలుంటే వాళ్లకు బిడ్డలను పట్టణాలకు పంపించే బాధ తప్పుతుంది కదా! పల్లెవాసులకు వీటన్నింటికి మించిన ఆనందకర విషయం సమృద్ధిగా వర్షాలు కురవడం, రిజర్వాయర్‌లు, బావులు, చెరువులు నిండడం. ఈ ఏడాది రెండు పైర్లు వేసుకుంటామనే ధీమాతో రైతులున్నారు. చంద్రబాబు పాలనలో ఐదేళ్లుగా కరువును చూసిన పల్లె ప్రజలు, వైయస్ జగన్మోహన్‌రెడ్డి రావడం వల్లే ఈ స్థాయిలో వర్షాలు కురిసాయని నమ్ముతున్నారు. సెంటు కూడా ఖాళీలేకుండా పైర్లు పెడుతున్నారు. పైర్లు పెట్టడంతో పల్లెల్లో పనులు పూర్తిస్థాయిలో వున్నాయి. ఎవరూ ఖాళీగా లేరు. ఇంకో నాలుగు నెలల దాకా పనులే! ఆ తర్వాత కోతలతో పల్లె సీమలు పండుగ చేసుకోనున్నాయి.

జగన్ పుణ్యమా అని పల్లెల్లో పండుగ వాతావరణం వుంటే, పట్టణాలు మాత్రం నిరుత్సాహ వాతావరణంలో వున్నాయి. పట్టణాలలో వ్యవసాయం ప్రభావం వుండదు. వ్యాపారాల ప్రభావం ఎక్కువుగా వుంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల మూలంగా వ్యాపార వర్గాలలో నిరాశాజనక వాతావరణం నెలకొందన్నది వాస్తవం. మద్యం అమ్మకాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో వ్యాపారవర్గాలు ఆ రూపంలో కొంత అసంతృప్తిగా వున్నాయి. అన్నింటికంటే రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన ఇసుక పాలసీ విధానం వివిధ వ్యాపార రంగాలపై అనూహ్య ప్రభావం చూపిస్తోంది. ఇసుక రేట్లు పెరగడం మూలంగా స్థిరాస్తి వ్యాపార రంగంపై పెనుభారం పడింది. దీంతో రియల్‌ఎస్టేట్ రంగంలో కొంత స్తబ్దత ఏర్పడి దాని ప్రభావం అనేక ఇతర వ్యాపారాలపై కూడా పడింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పనులన్నీ నిలిచిపోవడంతో పట్టణాలలోనే ఎక్కువుగా నివసించే కాంట్రాక్టర్లు అసంతృప్తితో వున్నారు.

మొత్తానికి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో పల్లెల్లో మాత్రం ఉత్సాహంగా వుంది. ప్రభుత్వం పరంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఒకెత్తయితే, సకాలంలో వర్షాలు పడి పంటలు వేసుకునే అవకాశం రావడం మరో ఎత్తు. ప్రకృతిపరంగా కూడా సీఎం వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి సహకారం అందిందనే చెప్పాలి.

కాకపోతే పల్లెలతో పాటు పట్టణాలూ ముఖ్యమే! వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు బాగుంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతుంటాయి. కాబట్టి వాటిని కూడా ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ విధాన నిర్ణయాలుండాలి.

# వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు



నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో ఈనెల 17న వాకర్స్ సభ్యులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించినట్లు జడ్పీ వాకర్స్ సంఘం కార్యదర్శి మండవ శ్రీనివాసరావు తెలిపారు. వాకర్స్ సభ్యురాలైన రాణెమ్మ బీపీ పరీక్షలను పర్యవేక్షించగా, షుగర్ పరీక్షలను వాకర్స్ సభ్యురాలు షేక్ ఖాజీ మస్తాన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వికలాంగుల హాస్టల్ విద్యార్థినులకు మెట్టు సుధాకర్‌రెడ్డి సౌజన్యంతో ఆపిల్ పండ్లను పంపిణీ చేశారు. చెంచయ్య, కృష్ణయ్య, రాజగోపాల్, నందకుమార్, సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, శేషయ్య పాల్గొన్నారు.

# కంచుకోటకు బీటలు

(మొదటి పేజీ తరువాయి)

కొడాలి నానికి తెలుగుదేశం అభ్యర్థిగా గట్టి పోటీ ఇచ్చిన దేవినేని అవినాష్ కూడా టిడిపిని వీడి వైసిపిలో చేరాడు. కృష్ణాజిల్లా నుండి ఇంకా కొందరు నాయకులు తెలుగుదేశాన్ని వీడి వైసిపి బాట పట్టేందుకు సిద్ధంగా వున్నారని సమాచారం.

తెలుగుదేశంను వదిలి వస్తున్న నాయకులను గెలికి ఇంకొంచెం గలీజు అవుతున్నారు తెలుగుదేశం వాళ్ళు. టీవీఛానల్స్ చర్చా వేదికల పులి వై.బాబూరాజేంద్రప్రసాద్ ఒక ఛానల్‌లో జరిగిన చర్చలో వల్లభనేని వంశీని కలబెట్టాడు. అతని చేత నానాతిట్లు తినడమే కాదు, చంద్రబాబును కూడా తిట్టించాడు. అంతేకాదు, చంద్రబాబు పవన్ కళ్యాణ్‌ల మధ్య బంధాన్ని కూడా వంశీ బయటపెట్టాడు. తెలుగుదేశం అంతర్గత విషయాలన్నీ వీళ్లకు తెలుసు. వాళ్ళపై ఆరోపణలు చేసే కొద్దీ చంద్రబాబు చీకటి పనులే బయటపడుతుంటాయి.

## కాలధర్మం

### చిట్టమూరు అనసూయమ్మ (బుజ్జమ్మ)



మనుబోలు వాస్తవ్యురాలు శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ (బుజ్జమ్మ) తన 89వ యేట నవంబర్ 19వ తేదీ చెన్నైలో తుది శ్వాస విడిచారు. సర్వేపల్లి నియోజకవర్గ రాజకీయాలలో కీలక పాత్ర పోషించి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించిన సౌమ్యశీలి, స్నేహ స్వభావి స్వర్గీయ చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి అనసూయమ్మ.

వైద్య రంగంలో విశేష సేవలందిస్తూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటూ అటు కావలిలోనూ ఇటు గూడూరులోనూ పేరుగాంచిన చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి (సియల్‌యన్ రెడ్డి), చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి (సిఆర్‌రెడ్డి)లకు ఈమె స్వయానా చెల్లెలు, చెన్నైలో తెలుగువారి ప్రతినిధిగా గత 5 దశాబ్దాలుగా తన సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైద్య రాజం, డాక్టర్‌గానే కాకుండా సామాజిక, సాంస్కృతిక, కళా సేవారంగాలలో తన ముద్రను వేసుకున్న డాక్టర్ చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి (సియంకె రెడ్డి) అనసూయమ్మకి తమ్ముడు మరియు అల్లుడు కూడా. ఈమె మరో తమ్ముడు డాక్టర్ మోహన్‌రెడ్డి కూడా వైద్యునిగానే చెన్నైలో తన సేవలందిస్తున్నాడు. లాయర్ పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డికి కూడా అనసూయమ్మ వరుసకు సోదరి అవుతుంది. అనసూయమ్మకి ఒక కుమార్తె ఇద్దరు కుమారులు. కుమార్తె నిర్మల సియంకెరెడ్డి సతీమణి కాగా, పెద్ద కుమారుడు చిన్న వయసులోనే కన్నుమూశాడు. స్నేహ బాంధవుడు, స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత ప్రీతిపాత్రుడైన ఆమె రెండవ కుమారుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి 2005 డిసెంబర్లో తన 50వ యేట కన్నుమూశారు.

మనుబోలు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో సైతం పద్మనాభరెడ్డి, అనసూయమ్మ అంటే తెలియని వారు లేరు. ఇంటికి ఎవరొచ్చినా ఆప్యాయంగా ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చేవారు ఆ దంపతులు. అనసూయమ్మ మరణంతో ఆ ఇంటికే కాదు ఆ గ్రామానికే కళ పోయిందని గ్రామస్తులు అనుకుంటున్నారంటే ఆ దంపతుల ప్రభావం వారిపై ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. ఇంటి పెద్దను కోల్పోయిన చిట్టమూరు, చిల్లకూరు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుకుంటూ అనసూయమ్మ ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

### వెంగళరెడ్డి లీలావతమ్మ



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీడైరెక్టర్ వెంగళరెడ్డి దామోదర్‌రెడ్డి మాతృమూర్తి శ్రీమతి లీలావతమ్మ ఈ నెల 21వ తేదీ ఉదయం స్వర్గస్తు రాలైనారు. ఆమె వయసు 82 సంవత్సరాలు. కోవూరు మండలం ఇనమడుగు వారి స్వగ్రామం. దామోదర్ రెడ్డి ఒకరే వారి సంతానం. సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌గానేకాక అంతకుముందు 10ఏళ్లు ఇనమడుగు రూరల్ బ్యాంకు అధ్యక్షులుగా, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడిగా సమర్థవం తంగా పనిచేసిన దామోదర్‌రెడ్డి జిల్లావాసులకు సుపరిచితుడే! లీలావతమ్మ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పట్టణ వలసలు నిరోధించే చర్యలేవీ?

## రాజ్యసభలో ప్రశ్నించిన విపిఆర్

దేశంలో పెరుగుతున్న పట్టణ వలసలను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. 20వ తేదీ రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పట్టణ వలసలను నిరోధించేందుకు కేంద్ర పట్టణ వ్యవహారాలు, గృహనిర్మాణ శాఖ చేపట్టిన పథకాలు, వాటికి కేటాయించిన నిధులు, మూడు సంవత్సరాలుగా వాటి కోసం ఖర్చు చేసిన నిధులు, ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధుల వివరాలు తెలపాలని అడిగారు. అలాగే కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు.

దీనిపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి స్పందిస్తూ, పట్టణ వలసలను నిరోధించేందుకు ప్రత్యేక పథకాలు లేవని, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్వచ్ఛభారత్ మిషన్ – అర్బన్, అటల్‌మిషన్ ఫర్ రెజ్యూవేనషన్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్, స్మార్ట్‌సిటి మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, అర్బన్ దీన దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్ వంటి కార్యక్ర



మాల ద్వారా పట్టణ మౌలిక సదుపాయాలను, ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని వివరించారు.

అలాగే దేశంలోని 50 భౌగోళిక ప్రదేశాలకు పైప్‌డ్ నేచురల్ గ్యాస్‌ను విస్తరించబోతున్నారని, అందులో నెల్లూరు జిల్లా ఉన్నట్లయితే వాటి వివరాలను వెల్లడించాలని విపిఆర్ కోరారు. నెల్లూరు జిల్లాలో సిఎన్‌జి(కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) అందించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఆయన కోరారు. దీనికి కేంద్ర పెట్రోలియం, సహజ ఇంధన వనరుల శాఖ మంత్రి స్పందించి... పైప్‌డ్ లైన్ గ్యాస్ సరఫరా కోసం 14రాష్ట్రాలలోని 124 జిల్లాల్లో 50 భౌగోళిక ప్రదేశాలను గుర్తించామని, అందులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కూడా వుందని పేర్కొన్నారు. పిఎన్‌జి మరియు సిఎన్‌జి అందించేందుకు నెల్లూరుజిల్లాలో పిఎన్‌జి ఆర్‌బి కన్సార్డియం ఆఫ్ ఏజి అండ్ పిఎల్ ఎన్‌జి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ అట్లాంటిక్ గల్ఫ్ స్పెసిఫిక్ సంస్థకు అధికారం ఇవ్వడం జరిగిందని చెప్పారు. జిల్లాలో 8,52,111 పిఎన్‌జి కనెక్షన్లను గుర్తించారని, ప్రణాళికా వ్యవధిలో పైప్ లైన్ గ్యాస్‌ను అందించడం జరుగుతుందని మంత్రి వివరించారు.



# ఇజ్రాయిల్‌లో ఇరిగేషన్ మంత్రి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్ ఈనెల 17వ తేదీన ఇజ్రాయిల్ వెళ్లాడు. అయ్యప్ప మాల ధరించిన అనిల్ శబరిమలైకి వెళ్లి ఇరుముడి సమర్పించిన అనంతరం ఇజ్రాయిల్‌ను సందర్శించాడు. 18వ తేదీ అక్కడ జరిగిన 'వాటిక్' అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని 'సాల్టింగ్ వాటర్ ఛాలెంజ్ ట్రావెల్ కాన్సెప్ట్'పై ప్రసంగించాడు. సాగునీటి రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వివరించాడు. ఇజ్రాయిల్ దేశంలో అమలవుతున్న సాగునీటి విధానాలను, వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించాడు. ఈ నెల 23న ఇజ్రాయిల్ పర్యటన పూర్తి చేసుకుని అనిల్ ఇండియాకు తిరిగి రానున్నాడు.

# 'రత్నం' పరిపాలనాధికారిగా వి.వి.నాయుడు



జిల్లా విద్యారంగానికే మణిమకుటం లాంటివి రత్నం విద్యాసంస్థలు. విద్యారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన విద్యాసంస్థలు. రత్నం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడిచే రత్నం జూనియర్ కళాశాల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(సిఏఓ)గా వి.వి.నాయుడును నియమించినట్లు రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం సార్ తెలిపారు. 20వ తేదీన నెల్లూరులోని రత్నం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వి.వి.నాయుడును కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రత్నం సార్ మాట్లాడుతూ విద్యా బోధనలో తమ విద్యాసంస్థలకు ఒక బ్రాండ్ ఇమేజ్ వుందని, విద్యార్థులకు మరింతగా సేవలందించడానికి, మంచి ఫలితాలు సాధించడానికి సిఏఓగా వి.వి.నాయుడును నియమించామని చెప్పారు.

## శ్రద్ధాంజలి




మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

**శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు**

(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి)

నవంబర్ 19వ తేదీ, మంగళవారం రాత్రి పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...

తమ్ముడు
**డా॥ సి.మోహన్‌రెడ్డి**, చెన్నై

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల**, చెన్నై

కోడలు
**డా॥ సి.భారతి**, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)

మనుమరాలు, మనుమడు
**ప్రణీత, లోహిత్**, యు.యస్.ఏ

మనుమడు - మనుమరాలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి**, చెన్నై

మనుమరాలు - మనుమడు
**శ్రీమతి హరిత - డా॥ రమానంద్‌రెడ్డి**, కాకినాడ

మునిమనుమలు మునిమనుమరాండ్రు
**జయేష్ & అస్మిత**  **కీర్తన లక్ష్మి & తనవ్**

**ఉత్తరక్రియలు:** వారి ఉత్తరక్రియలు **తే.23.11.2019ది,** శనివారం ఉదయం 10.30గంటలకు, నెల్లూరు జిల్లా, మనుబోలు గ్రామంలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com